త్రంతయు నే నీమెకు స్త్రీధనముగా వ్రాసి యిచ్చెదను. నీ వీమెను మహారాజునకిచ్చి వివాహము చేసినను, నీ కతఁడింతకంటె నెక్కు వేమియు చేయఁజాలఁడు.

సుద—నీ వత్యద్భుత మయినవాఁడవుగా నున్నావే! నీవు తప్ప నీవలె నుపకార కార్యమును చేయువారు మఱియెవ్వరును లేరని నీకు గర్వమున్నదా యేమి?—ఓ భానుమతీ! నే నెఱిఁగినంతవఱకు నీహరణ మక్కఱలే దన్నవాఁడు నాకితఁ డొక్కఁడు కనఁబడు చున్నాఁడు. ఈ భరతఖండములో నెల్ల నీహరణమును పొందుటకితఁడే యర్హతముఁడని నా యభిప్రాయమగుట నీవు నీ ప్రియుఁడయిన యీ గర్వితునితోఁ జెప్పు. ఇదిగో మి మ్మిద్దఱిని నే నిప్పు డాశీర్వదించు చున్నాను. తప్పిదము నాదయినప్పుడు పట్టిన పట్టు నేను విడుచువా డనే కాక, న్యాయవిషయములో నేనన్నమాట యెప్పుడును తిరుగు వాఁడను కాననికూడ మీరు తెలిసికోఁ గలరు.

[అప్పుడు విజయవర్మయు సుదంతయు ప్రవేశించుచున్నారు.]

సుద—ఇక్కడ నా కింకొక యద్భుత మగపడు చున్నది! ఓ విజయవర్మా! నీవు యోగిని నెవ్వతెనైన మఠమునుండి లేవదీసి కొని రాలేదుగదా?

విజ—ఈమె పయిబట్టలో నేకాని మఱియెందులోను యోగిని కాదు. దగ్గఱగా వచ్చిచూడుఁడు. ఈమె మాధవసేనుని కూఁతు రయిన సుదంతయగుట మీ కన్నులే తేట పఱుచును.

సుద—ఇది మహాభాగ్యము! నీ వెంతో తెలివిగల పడుచు వాఁడవు. నిన్ను క్షమించినాను ఓముద్దులకోడలా! నీవు చక్కని చిన్నదానవు. నీముసలిమామగారి కొక్కసారి నీ నవ్వు మొగము ముద్దిమ్ము.

సుదంత—అయ్యా! ఇఁకముందు మీరు మమ్మాదరించి కడుపులో పెట్టుకో వలెను.

(అని చేయిముద్దిచ్చుచున్నది.)

సుద—తావళములు త్రిప్పుటచేత నీచేతులింకను గఱకుపాఱ లేదే! నేనిప్పుడు సంతోషము పట్టఁజాలకున్నాను—ఓరీ! దామోదరా! ఘటకా! దారకా! మన వీధితలుపులు తీసియుంచినారా! ఈవచ్చుచున్న మాకుబిడ్డలవివాహములే గొప్ప వేడుకలు. ఈరాత్రి యుత్సవము దివ్యముగాజరగవలెను. మన బంధువులును మిత్రులును వచ్చుచున్నారు. పిన్నపెద్దలందఱును కలిసి యీరాత్రి యుల్లాసముగా గడపవలెను.

[లోపల సంగీతము పాడఁబడుచున్నది.]

ముత్తకోకిల

సుద—ఎల్లవారలు రండు వేడుక హెచ్చునిచ్చుట హాయిగా
కొల్లగాఁగను పెండ్లిపాటలు కోరిపాడుచునవ్వుచుఁ
జెల్లఁగానిదె ప్రొద్దుపుత్తము మిత్రులార! కడంకతో
నుల్లమందలి చింతయంతయు నొక్కసారి యడంగఁగఁ.

తరళ

భాను—మనసులోపల సంతసంబులు మల్లడింపఁగ వేడుకఁ
ఘనులుమీరలు పాడియాడుచుఁ గాలమొక్కక్షణంబులోఁ
జనఁగఁ జేయుఁడు మీదునేర్పున జాగుచేయక యివ్వడిఁ;
వినుఁడు వేఁడెద మిమ్ము నేశుభవేళ యియ్యదిగావునఁ.

సుగంధి

విజ—క్రొత్తపెండ్లికూఁతులార! క్రొత్తపాటలఁ
చిత్తరంజకంబుగాఁగఁ జేరి మీరు పాడుఁడీ

వృత్త మిప్పు డించుకంత ప్రొద్దు నవ్వులాటలన్
నృత్తగీతవిద్యలందు నేర్పు చూపి తన్పుఁడీ.

పంచచామరము.

కామ—కరంబు మీఱు సౌఖ్య మిచ్చుఁగాత రాత్రివిందిటన్;
దిరంబు లేక యెల్లవారుఁ దద్దయు న్ముదంబునన్
బిరాన నాటపాటలందు వేడ్క యింత చూపుఁడీ;
పరాత్పరున్ స్తుతించి భక్తిఁ బ్రార్థనంబు సల్పుఁడీ.

ఉత్సాహ.

సుదంత—వ్యసన మెల్లఁ బాఱఁద్రోలివలయు మదులనుండి నేఁ
డసమమైనసంతసమున నలరవలయు నెల్లరున్;
వెసను మనము చేరి యిందు వింతవింతక్రీడలన్
దెసలు మాఱుమ్రోయ వేడ్క దెలుపవలయు నిత్తఱిన్.

స్రగ్విణి

సుద—ఇందుఁ గూర్చున్నవారెల్ల నల్లంబులన్
బొందుగా మోదముం బొంది యీరాత్రి యీ
మందిరంబందు సమ్మాన మొప్పారఁగన్
విందులై వీరి దీవింపుదుర్ గావుతన్.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

సంపూర్ణము.

బాక్స ప్రెస్, రాజమహేంద్రవరము.—1950.

శ్రీ

కళ్యాణకల్పవల్లి

గ్రంథకర్త:-
కందుకూరి వీరేశలింగము పంతులు

నాల్గవ కూర్పు

ప్రకాశకులు :
హితకారిణీ సమాజము
రాజమహేంద్రవరము
1950

ఈ నా ట క ము నం దు వ చ్చు పా త్ర ము లు

పు రు షు లు

1. వీరసేనుఁడు—విక్రమసేనునితండ్రి.
2. విక్రమసేనుఁడు—వీరసేనునికొడుకు; కళావతిప్రియుఁడు.
3. దర్పసారుఁడు—చారుమతియొక్క ప్రియుఁడు.
4. దామోదరవర్మ—కళావతిని వరింపఁగోరిన రాజపుత్రుఁడు.
5. పురుషోత్తమదేవుఁడు—కళావతి తన్నుఁగామించినదనుకొన్న యొక క్షత్రియవీరుఁడు.
6. విజయపాలుఁడు—విక్రమసేనుఁడు పెట్టుకొన్న మాఱుపేరు.
7. రాముఁడు—విక్రమసేనుని భృత్యుఁడు.
8. మాధవుఁడు—దామోదరవర్మ సేవకుఁడు.
9. శంకరుఁడు—వీరసేనుని బండివాఁడు.

స్త్రీ లు

10. సుభద్రమ్మ—కళావతి మేనత్త.
11. కళావతి—విక్రమసేనుని వరించిన రాజపుత్రి.
12. చారుమతి—దర్పసారుని వరించిన రాజపుత్రి.
13. మంథర—సుభద్రమ్మ దాసి.

కళ్యాణకల్పవల్లి

——:o:——

ప్రథమాంకము

౧. రంగము—పిఠాపురములోని వీధి

[రాముఁ డొకప్రక్కనుండియు, శంకరుఁ డొకప్రక్కనుండియు ప్రవేశించుచున్నారు]

రాము—వాడు శంకరుడా యేమిటి? అవును సందేహంలేదు. శంకరుఁడే—శంకరా! శంకరా!

శంక—ఎవరువారు? ఓహో! నాపాతస్నేహితుడు రాముడా! ఓరామూ! నిన్ను చూచి యెంతకాల మయిందిరా? దగ్గరగా వచ్చి నన్ను కౌగిలించుకో.

రాము—వద్దు వద్దు. నాబట్టమాసిపోతుంది. నిన్నుచూడడంచేత నాకు సంతోషం పట్టరాకుండా వున్నది. బండి బాగాతోలుతూ వున్నావా? నిన్ను పిఠాపురంలో చూస్తానని యెప్పుడూ అనుకోలేదు.

శంక—అయ్యగారూ, చారుమతీ, అమ్మగారూ, వెంకిగాడూ అందరమూ వచ్చినాము.

రాము—అలాగా?

శంక—అయ్యగారికి పిఠాపురం చూడవలెనని బుద్ధిపుట్టి గంటలో మమ్మలినందరినీ ప్రయాణంచేసి బయలుదేరినారు.

రాము—ఆయన యెప్పుడూ తొందరమనిషే. అలా చెయ్యకపోతే వీరసేనుడుగారి పేరులో గొప్ప యే మున్నది?

శంక—దానికేంగాని నీచిన్నయజమానుడుగారు యెట్లా వున్నారు? విక్రమసేనుడిగారిని యిక్కడచూస్తే వీరసేనుడుగారు అద్భుతపడుతారు.

రాము—నేను యిప్పుడు విక్రమసేనుడిగారివద్ద పనిలోలేను.

శంక—అలాగా? మరియెవరివద్ద వున్నావు!

రాము—ప్రస్తుతం నేను విజయపాలుడిగారివద్ద వున్నాను.

శంక—ఈమార్పువల్ల నీస్థితి యేమీ బాగుపడ్డట్టు నే ననుకోను.

రాము—యేమీ మార్పేలేదు.

శంక—మార్పేలేదా? విజయపాలుడిగారివద్ద పనిలో వున్నానని యిప్పుడు నాతో నీవు చెప్పినావే.

రాము—నిన్ను యిఖ చిక్కులుపెట్టను. విక్రమసేనుడుగారూ విజయపాలుడుగారూ యిద్దరూ వొక్కరే.

శంక—ఇద్దరూ వొక్కరేనా? యేమిహాశ్చర్యం!

రాము—వొక్కరే. వెనుకటి విక్రమసేనుడిగారే యిప్పుడు విజయపాలుడుగా రయినారు. కాబట్టి యిప్పుడు నాకు విజయపాలుడి కొలువే కాని విక్రమసేనుడితో పనిలేదు.

శంక—అలాగయితే యిదియేదో మాయలాగువున్నది. నీకు తప్పకుండా తెలిసివుంటుంది. నీ స్నేహితుణ్నిగదా నా కీమర్మం చెప్పవా?

రాము—నీవు రహస్యం దాచగలవా?

శంక—బండిదొడ్లో యెడ్లను పెట్టినట్టు మనస్సులో పెట్టుకొని పైకి రానియ్యను.

రాము—దీనికంతా కారణం కాముడు. ఏమిటో చెప్పకో.

శంక—అవు నవును. నాకిప్పుడు బోధపడ్డది. సంగతంతా వూహచేసినాను. ఈవ్యవహారంలో యేదో స్త్రీవున్నది. సరే కాని నీయజమానుడు తా నెవరని చెపుతూ వున్నాడూ?

రాము—తాను సేనాధిపతినన్న మాట మరుగుచేసి చిన్న వుద్యోగస్థు డయినట్టు నటిస్తూవున్నాడు.

శంక—సేన కధిపతి అయియుండగా చిన్నవుద్యోగస్థుణ్ణని యెందుకు చెప్పకో వలెను? సేనాధిపతినని చెప్పకోవడానికి చిన్న తనంగా వున్నదా?

రాము—కాదు కాదు. దానికి హేతువు వేరేవున్నది. నా యజమానుడు కామించిన చిన్నది మహావిచిత్రమయినది. ఆవిడెకు ముప్ఫయి వేల రూపాయలు వచ్చే సంస్థానానికి ప్రభువయినవీరసేనుని కొడుకున్ను సేనాధిపతిన్నీ కావడం కంటే చిన్నవుద్యోగస్థుడుగా వుంటేనే నాయజమానుడియందు యెక్కువ యిష్టం.

శంక—ఇదీ వింతగానే వున్నది. ఆవిడెవద్ద డబ్బు బాగా వున్నదా యేమిటి? ఆవిడె భాగ్యవంతురాలా!

రాము—భాగ్యమో గీగ్యమో నాకు తెలియదు. ఆవిడె యింట్లో మోహిరీలు మీపశువులదొడ్లో గడ్డిపరకలలాగు యెక్కడ చూచినా దొర్లుతూవుంటవి. పశువుల కడుగుగోలెములుకూడా వారింట్లో బంగారవువే. పంజరంలో చిలుకలకు మంచిముత్యాలు మేతపెడుతారు.

శంక—అలాగయితే ఆవిడెవద్ద పదిసంచు లయినా వుంటవి. ఆవిడెకు నీయజమానుడియందు అనురాగమేనా?

రాము—అనురాగ మేమిటి? నాయజమానుడంటే చెవులు కోసుకుంటుంది.

శంక—ఆవిడె పేరు యెవరైనా వినవచ్చునా?

రాము—ఆవిడెపేరు కళావతి. అయితేనేమి కాని ఆ చిన్నదానికి ముసలిమేనత్తవొకతె పానకంలో పుడకలాగు ప్రతిబంధకంగా వున్నది. అయినా కానీ ఆపెద్దావిడె యిదివరకు నాయజమానుణ్ని యెప్పుడూ చూడలేదు. ఆచిన్నది పువ్వులతోటలో విహారానికి వచ్చినప్పుడు మేమామెతో పరిచయం కలుపుకున్నాము.

శంక—అలాగయితే వారిద్దరికీ వేగిరం ముడివేసి పెళ్ళిలంకె వేస్తే బాగావుంటుంది. ఈసంగతి కేమిగాని యీపిఠాపురం యెటువంటిది? యీవూరిని గురించి నేను యిదివరకు చాలావిన్నాను. ఈవూళ్ళో వేడుకగా ప్రొద్దుపుచ్చడానికి అన్నీ వుంటవి కావూ?

రాము—అన్నీవున్నవి. మేము యెప్పుడూ స్నానం చెయ్యక పోయినా నాయజమానుడూ నేనూ ప్రతిదినమూ ప్రాతఃకాలము పాడగయకు వెళుతాము. భోజన మయినతరువాత తోటలోకయినా వెళుతాము; చీట్లయినా ఆడుకుంటాము. సాయంకాలము వూరిబయటికి షికారు వెళుతాము. పాడువూరు ఈవూరంటేనాకప్పుడే విసుగు వేస్తూవున్నది. రాత్రి పదిగంట లయినతరువాత వూళ్ళో యెక్కడా సందడే వుండదు. పాటలూ లేవు పదాలూ లేవు. యేమీ లేవు. అయినా దర్పసారుడిగారి నవుకరూ నేను కలుసుకుని రాత్రిళ్లు వినోదంగా ప్రొద్దు గడుపుతూవుంటాము. అతణ్ని నీకు చూపిస్తునా? వొక్కమాటు చూచినా వంటే నీ వతణ్ని మళ్ళీ వదలిపెట్టవు.

శంక—నేనాజోగిగాడిని యెరుగుదును. వాడియజమానుడు మన చారుమతిని పెళ్ళాడేచూట నీవు యెరుగవు కాబోలును.

రాము—నేను మరచిపోయినాను. ఓయీ శంకరా! మాతో సహవాసం చెయ్యవలెనంటే నీవు నీ వేషంకొంచెం మార్చుకోవలెను. గంగిరెద్దు పాగాలాగు నీ కీతలగుడ్డ యెంతమాత్రమూ బాగావున్నది గాదు. నీ వీపాటి తలగుడ్డ మానివేసి టోపీ పెట్టుకోవడం నేర్చుకోవలెను. ఇప్పుడు వుద్యోగస్థులూ అందరూకూడా పాగాలు మానివేసి టోపీలు పెట్టుకుంటూ వున్నారు.

శంక—వాళ్ళ గ్రహచారం టోపీలు పెట్టుకుంటే వాళ్ళే చెడిపోతారు. నేనుమాత్రం లక్షవరహాలుయిచ్చినా మా తాతముత్తాతల నాటినుంచి వంశపరంపరగా వస్తూవున్నతలపాగా మానివెయ్యను. యెవళ్ళో పనికిమాలిననిర్భాగ్యులు పూర్వాచారం వదులుకుంటారు గాని నావంటి దేశాభిమానులు యెప్పుడూ వదిలిపెట్టరు.

రాము—నీవు టోపీ పెట్టుకోకపోతే మానినావుగాని వూరికే కోపపడకు.

శంక—పూర్వాచారం మీరితే యెంతోపాపం వస్తుంది. స్కూలుపిల్లవాళ్ళు టోపీలు పెట్టికుంటూవున్నా చాకలి సర్విగాడూ, మంగల మల్లిగాడూ, గమళ్ళ గాలిగాడూ, మావూళ్ళో పెద్దమనుష్యులు. అందరూ నెత్తికి తలగుడ్డలే పెట్టుకుంటూవున్నారు.

రామ—వూరుకో యెవరో వస్తూవున్నట్టున్నారు.

శంక—మరియెవరూ కారు. మా చిన్నదొరగారు విక్రమసేనుడుగారు. నీవు యిప్పుడుచెప్పినది ఆయనతోకూడా వున్న చిన్నదేనా?

రాము—కాదుకాదు ఈవిడె మంథర నేను చెప్పిన చిన్నదానివద్దవుండేదాసీ. ఆయన ఆయింట్లోనే బసచేసినాడు. నేను వెంటనే వెళ్ళి మీరు యీవూళ్ళోకి వచ్చినవర్తమానం చెప్పవలెను.

శంక—అదుగో ఆయన దానిచేతిలో సొమ్ము పెడుతూ వున్నాడూ! ఓరీ! రామా! నిన్న వాక్కసంగతి అడగవలె నను కుంటూ వున్నాను.

రాము—నాకు యిప్పుడు మాట్లాడడానికి తీరుబడి లేదు. వేగిరం పోవలెను. నేటిరాత్రి తొమ్మిదిగంటలకు మే మందరమూ తోటితోటలో సభ చేరుతాము. నీవుకూడా అక్కడికి రా. సావకాశంగా అన్నిసంగతులూ అక్కడ మాట్లాడుకుందాము.

(ఇద్దఱును వేఱువేఱుమార్గములఁ బోవుచున్నారు.)

---

౨. రంగము—సుభద్రమ్మగారియింట నొకగది.

[కళావతి పుస్తకము చేతబట్టుకొని కూరుచుండి యుండఁగా నేదోసందేశమును గొని మంథర ప్రవేశించుచున్నది.]

మంథ—ఆపాస్తకంకోసం నేను వూరంతా వెతికినాను. యీ వూళ్లో యేపుస్తకాలకొట్టులోనూ ఆపుస్తకం లేదు.

కళా—తారాశశాంక మయినను దొరకినదా?

మంథ—అదీ దొరకలేదు.

కళా—బిల్హణీయమో?

మంథ—అదీ లేదు.

కళా—రాధికాసాంత్వన మున్నదా?

మంథ—అది వొక్కపుస్తకం వుండగా యెవరో కొనుక్కపోయినారట!

కళా—మఱి యేమితెచ్చినావు?

మంథ—మీరు యిచ్చిన రెండురూపాయిలకూ మూడు పొస్తకాలు తెచ్చినాను. ఇదుగో యిది సారంగధరచరిత్ర; యీ రెండోది వుషాకళ్యాణం; మూడోది రుక్మిణీకళ్యాణం.

(అని బల్లమీద పెట్టుచున్నది)

కళా—రుక్మిణీకళ్యాణముమాత్రము నాచేతికిచ్చి తక్కిన పుస్తకములు పరుపుక్రింద పెట్టు.

మంథ—ఇవి పరుపుకింద పెట్టి, అక్కడవున్న రాధామాధవ విలాసం తీసుకురానా?

కళా—నీవు మఱేదియుఁ దీసికొని రానక్కఱలేదు. ఈపుస్తకము లక్కడ బడవేసి నీవు వేగిరము పో. ఇక్కడ కెవరో వచ్చుచున్నారు ఎవరో చూడు. మా చారుమతి కంఠములాగున వినఁబడుచున్నది!

మంథ—అమ్మా! జానకమ్మగారు వస్తావున్నారు.

కళా—కాదు. నీవు వెళ్ళిపో.

మంథ—అమ్మా! వెళుతూవున్నాను.

(అని వెడలిపోవుచున్నది)

[చారుమతి ప్రవేశించుచున్నది]

కళా—ఓ ప్రియసఖీ! చారుమతీ! నిన్ను చూచుటచేత నా మనస్సున కపరిమితానందము కలుగుచున్నది. ఇంత శీఘ్రకాలములో నీదర్శనసుఖము కలుగునని నేనెన్నఁడు ననుకోలేదు.

(అని లేచి కౌఁగిలించుకొనుచున్నది)

చారు—చెలీ! కళావతీ! నీకంటెను నాకెక్కువ సంతోషముగా నున్నది. విశేషమేమి? మొట్టమొదట నే నడిగినప్పుడు నీ వింట లేవన్నారే!

కళా—సఖీ! నేను నీకు చెప్పవలసినవి వేయిసంగతులున్నవి. వీరింత యాకస్మికముగా పీఠికాపురమున కేలవచ్చినారో మొట్ట మొదట చెప్పు. వీరసేనుఁడు మామగారుకూడా వచ్చినారా?

చారు—వచ్చినారు. మేమిూ యూరిలో నడుగుపెట్టి రెండు గడియ లయినది. ఆయన స్నానముచేసి బట్టలు కట్టుకొనుట కాఁగా నే సుభద్రపిన్నిగారిని చూచుటకు వత్తు రనుకొనెదను.

కళా—అట్లయిన పక్షమున వారువచ్చి విఘ్నముచేయుటకు మొదలుపెట్టకముందే నాకష్టకథలు నీతోఁ జెప్పుకొనెదను. నీవు దూరాలోచన కలదాన వగుటచేత నా వేగిరపాటుచూచి చీవాట్లు పెట్టినను నీ మంచిస్వభావముచేత నీవు నా దురవస్థకు జాలిపడక మానవని నే నెఱుఁగుదును. విజయపాలునకును నాకునుగల సంబంధమును నా యుత్తరములవలన నీవు వినియున్నావుగదా! అతఁడు లభించుభాగ్యము నాకిప్పుడు పోయినది. మా మేనత్త మా యుత్తర మొకటి త్రోవలో పట్టుకొని మా యుత్తర ప్రత్యుత్తరముల సంగతి తెలిసికొని, అప్పటినుండియు నన్నీగదిలోఁ బెట్టి పైకిపోనీక నిర్బంధించు చున్నది. చెప్పితే నీవు నమ్ముదువో నమ్మవో కాని యింకొక విశేషముకూడ జరగినది. ఒకనాటిరాత్రి జానకమ్మగారియింటికి మేము భోజనమునకు వెళ్ళినప్పు డక్కడ జైనవిగ్రహములాగున పొడుగుగానున్న యా పురుషోత్తమదేవుని జూచి మోహించి మా మేనత్త యాతని వలలోఁ బడి పరితాపపడుచున్నది సుమా.

చారు—ఛీ! నీవూరకే పరిహాసము చేయుచున్నావు.

కళా—నీతోడు! పరిహాసముకాదు. నేను నిజముగానే చెప్పుచున్నాను. ఏదోమాఱుపేరుపెట్టుకొని యిప్పుడామె యతనితో నుత్తర ప్రత్యుత్తరములు జరపుచున్నది. కొంతకాల మయిన త

వాత తన నిజమయినపేరు బయలఁబెట్టఁ దలఁచుకొన్నది కాఁబోలును! ఆమె "రాధ" అని చేవ్రాలు చేయుచున్నది.

చారు—అట్లయినపక్షమున, ఇప్పు డాబిడ్డ నిశ్చయముగా తన మేనకోడలిని స్వతంత్రురాలినిగా విడిచిపెట్టి యుండును.

కళా—లేదు లేదు. ఆమెచర్య నీవనుకొన్నదానికి ప్రత్యక్ష విరుద్ధముగా నున్నది. తన దౌర్బల్యమును తెలిసికొన్నప్పటి నుండియు నాయం దాబిడ కనుమాన మెక్కువయినది. గోరుచుట్టుమీఁద రోకటి పోటులాగున నాకిప్పుడు మఱియొక పీడకూడ పట్టుకొన్నది. ఆ నిర్భాగ్యుఁడు. దామోదరవర్మకూడ నేఁడీగ్రామమునకు వచ్చుట తటస్థించినది. కాఁబట్టి నేనిప్పు డిన్నిపిశాచముల బాధ వదల్చుకొను టకు పోరాడవలెను.

చారు—కళావతీ! అధైర్యపడకు నీకిప్పుడు వచ్చిన భయము లేదు. వీరసేనుఁడుబాబుగారు నీ మేనత్తతో మాటాడి నీకు తొందర కలుగకుండఁ జేయుదురు లే.

కళా—అన్నిటినిమించిన దురవస్థ నాకింకొకటి పట్టినది. నీవది యింకను విననేలేదు. ఆయుత్తరము నా మేనత్త పట్టుకొనుటకు కొంచెము ముందుగా నాదౌర్భాగ్యమువలన నేను మందభాగ్యుఁడైన విజయపాలునితో కలహము పెట్టుకొన్నాను. ఆకలహనివారణము చేసికొనుట కతఁ డప్పటినుండియు మరల నాకంటఁ బడలేదు.

చారు—అతఁడు చేసిన యపరాధ మేమి?

కళా—ఏమియులేదు. అదియేమో నాకు తెలియదుగాని మేమెన్నిసారులు కలిసికొని మాటాడినను మాలో మాకొకసారి యైనను వివాదము రాలేదు. అందుచేత నతఁ డెప్పుడును ప్రణయకలహమునకైన నాకవకాశ మియ్యఁడేమో యని భయపడి నాలో

నే నాలోచించుకొని కడచినగురువారమునాఁడు నాకు నేనే యొక యుత్తరము వ్రాసికొని, దానిలో విజయపాలుఁడు మఱియొకసుందరి పయిని వలపు నిలిపి యున్నట్టు తెలియఁబఱిచినాను. అట్లు వ్రాసి యాయుత్తరములో క్రింద "నీ వెఱుఁగని నీప్రియసేవకురాలు" అని చేవ్రాలుచేసి, ఆయుత్తరమును విజయపాలునికిఁ జూపి నాయెడల ద్రోహము జేసితివని యాతనిని నిందించి, మనసులో లేనికోపమును మొగమునఁ దెచ్చుకొని మండిపడి. ఇఁకముందెప్పుడును నే నాతని ముఖము చూడనని యొట్టు పెట్టుకొన్నాను.

చారు—అట్లు పంపి వేసినతరువాత నీవాతనిని మరలఁ జూడనే లేదా?

కళా—ఆమఱునాఁడే మా మేనత్త మాగుట్టు కనిపెట్టినది. నేనతనిని మొట్టమొదటమూఁడుదినములుమాత్రమే బాధపెట్టఁదలఁచుకొంటినిగాని యిప్పుడాతనిని దక్కించుకొనుభాగ్యమే యెప్పటికిని దప్పిపోయినది.

చారు—నాకు నీవు వ్రాసిన ట్లతఁడు నీమీఁద నిజమయిన కూరిమి గలవాఁడయి నీచేట్టపట్టుట కర్హుఁడే యయినపక్షమున, ని న్నింతటితో నాతఁ డెప్పుడును విడువఁజాలి యుండఁడు. అయినను నీవే యాలోచించుకో. అతఁడు చిన్నయుద్యోగములో నున్నాఁడని వ్రాసినావు. నీకు మూఁడులక్షలరూపాయల సొత్తున్నదిగదా!

కళా—అవునుగాని యుక్తవయస్సు వచ్చులోపల నామేనత్త యనుమతిలేకుండ నేనువివాహము చేసికొనెడుపక్షమున నాసొమ్ములో విశేషభాగము నాకు రాదన్నసంగతి నీవే యెఱుఁగుదువు. అయినను నాతండ్రి యిట్టియేర్పాటు చేసినాఁడని నాకుఁ దెలిసినప్పటినుండియుఁ బదునెనిమిదిసంవత్సరములు నిండకముందే పెండ్లి చేసికొనవలెనని

నేను నిశ్చయము చేసికొన్నాను. ధనమునిమిత్తమయి యొక్కదినమయి నను వేచియుండవలసిన దని కోరెడుపురుషుని నెవ్వనిని నేను కామింపఁజాలను.

చారు—ఇది కేవలచపలత !

కళా—ఏమి! నాప్రియసఖి చారుమతి నాయందే చపలత్వ మారోపించి తప్పు పట్టుచున్నదా? నే నింతవఱకును చారుమతి ప్రియుఁడు దర్పసారుఁడు చారుమతికే చపలత్వము నేర్పినాఁ డను కొన్నాను.

చారు—ఆతనిదోషములనుగూడ గుణము లని భావించి నే నెప్పుడును ప్రేమింపను.

కళా—అయినను సమయమున కాతనికి సందేశము పంపియే నీ పక్కడకు వచ్చితి వనుకొనెదను.

చారు—నీతోడు ! లేను. నే నీపీఠికాపురము వత్తునన్న, మాటయే యాతనికిఁ దెలియదు. వీరసేనుఁడుబాబుగారు రీప్రయాణ మకస్మాత్తుగా తలపెట్టినందున, నేనాతనికి వర్తమానము పంపుట కయిన నవకాశము లేకపోయినది.

కళా—ఓచారుమతీ! వీరసేనుఁడుగారి సంరక్షణలోనున్నను నీవు స్వతంత్రురాలవు. అయినను నీ వతిదీర్ఘ మయిన యీసంవత్సర కాలమునుండియు భర్తృస్వాతంత్ర్యమును వహించుట కనుమానించుచు కాలహరణము చేయుచున్నకృతఘ్నుఁ డయినయాదర్పసారుని చాపల్యమునకును శంకాశీలత్వమునకును దాసురాల వయి యాతని గర్వము సాగనిచ్చుచున్నావుగదా !

చారు—చెలీ! నీవుపడ్డ యభిప్రాయ మెంతమాత్రమును సరియైనది కాదు. మాతండ్రిగారిమరణమునకు ముందే మేము వివా

హామునకు నిశ్చయము చేసికొన్నాము. ఆయనమ్మతియు తన్మూల మున వచ్చినకొన్ని చిక్కులును నడుమ నిలిచి నాహృదయవల్లభుఁ డయినదర్పసారుని మనోరథమునకు విలంబనము కలుగఁజేయుచున్నవి గాని యిం దాతనిదోషము లేశమును లేదు. అటువంటియల్పాంశ మునుబట్టి కాలహరణము చేయుట కతఁ డంత దయమాలినవాఁడు కాఁడు. ఆతనిస్వభావమును గుఱించికూడ నీవు వట్టిపాపము కట్టు కొనుచున్నావు. కళావతీ! అటువంటి మహోదారచిత్తుఁ డెప్పుడును శంకాశీలుఁడు కాఁడు. అతఁ డప్పుడప్పుడు కొంచెము చంచలహృద యుఁడుగా నున్నను, ఆతనిహృదయమునందు కాపట్య మన్నది యేమాలను లేదు; అప్పుడప్పుడు కొంచెము చిరాకుపడినను, మృదువు తప్పినమాట యాతనినోటినుండి యెప్పుడును రాదు. అతఁ డీవఱకు కామతంత్రముల కలవాటుపడినవాఁడు కాకపోవుటచేత, ప్రియు రాండ్రు నాయకులవలనఁ బ్రతీక్షించు ప్రియభాషలను వేషములను జూపుటయందుమాత్ర మతఁ డంత నిపుణుఁడు కాఁడు. కానియాతని ప్రేమయు వినయవర్తనమును నవ్యాజములయినవి. అతనిహృదయము నందలిప్రేమ మేరమీఱినదగుటచేతఁ దనప్రియురాలును మాటల చేతను చేఁతలచేతను దనయం దట్టిప్రేమమునే చూపవలె నని యతఁడు ప్రతీక్షించుచుండును. తనయందుఁగల గుణాతిశయమును బట్టి యతఁ డెంత ప్రేమకయినను నర్హుఁడేయయినను, వినయగుణము చేత నతఁడు తనగుణాతిశయమును గొప్పగా భావించుకొనకున్నాఁడు. అవ్యాజప్రేమమును జూపుట కర్హమయినగుణగౌరవము తనయం దేమున్నదని భావించుకొను నమ్రతకలవాఁ డగుటచేత, అతఁడు తనమీఁద తగినంతయనురాగ ముండదేమో యని శంకించుచుండుట కలదు. ఆతనియెడఁగల యీస్వభావమే నామనస్సును గొన్నివేళల

యందుఁ బరితాపముపాలు చేయుచున్నది. ఇటువంటిసందేహములు కూడ నాయందుఁ గలప్రేమాధిక్యమునుబట్టియే యుత్పన్నము లగుచుండుటచేత, అనురాగఋణమును పూర్ణముగా తీర్చుకొలేక నేనే యాతని కప్పుపడి యున్నానని నేనొప్పుకోవలసి యున్నది.

కళా—ఓ చారుమతీ! ఆతనిపక్షమవలంబించి సమాధానము చెప్పఁ బూనుకొన్నందుకు నిన్ను నేను నిదింపను. కాని నిన్ను నే నొక్కప్రశ్న వేసెదను. నీవుదానిని కపటము విడిచి యుత్తరము చెప్పవలెను. అతఁడు నీప్రాణరక్షణము చేసినవాఁడు కాకయుండిన పక్షమున, ఇప్పుడున్నంత ప్రేమ నీ కాతనియం దుండియుండునా? ఆదియందు నీపడవను తలక్రిందు చేసినయాక్రూరవాయువే యంతమందు నీమనస్సులో నాతనిపై ననురాగమును పూరించుటకు నీపాలిటి యనుకూలదేవత యయినది.

చారు—నాకతనిమీఁదియనురాగము కృతజ్ఞతవలనఁ గొంత బలపడి యుండవచ్చునుగాని నాప్రాణరక్షణము చేయకముందే నా కాతనిమీఁద నవ్యాజానురాగము గలదు. అయినను నాకతఁడు చేసినమహోపకార మొక్కటియే నన్నాతనియెడ బద్ధానురాగనుగాఁ జేయజాలినంత యనుబంధ మయినందుకు సందేహము లేదు.

కళా—ఇది యొక యనుబంధకారణమా? ఆసమయమందు దాపున నున్నపక్షమున నీటికుక్కసహిత మట్టిపని చేసి యుండును. ఈఁత చేతనయినవాఁ డన్నిహేతువుచేత నేనుమాత్ర మెన్నఁడును నాహృదయ మెవ్వరికి నర్పింపఁజాలను.

చారు—కళావతీ! ఇటురా. బొత్తిగా నీవాలోచన లేని మాట లాడుచున్నావు.

కళా—నేనూరక పరిహాసము కన్నాను. ఈమాటలు పాటిగాఁ బట్ట బోకు—ఎవరో వచ్చుచున్నారు.

[మంథర త్వరతోఁ బ్రవేశించు చున్నది.]

మంథ—అమ్మా! అమ్మా! మీమేనత్తగారితోఁ గలిసి వీర సేనుఁడుగారు యిప్పుడే మనయింటికి వచ్చినారు.

కళా—వారిక్కడకు రారు—మంథరా! నీవు కనిపెట్టియుండి నాతోఁ జెప్పు.

మంథ—చిత్తము. (అని వెళ్లుచున్నది.)

చారు—వచ్చినను రాకపోయినను నేనుపోవలెను. నేనిక్కడకు వచ్చినసంగతి వీరసేనుఁడుబాబుగా రెఱుఁగరు. ఆయన నన్నిక్కడఁ జూచినపక్షమున, పోనీక నిలిపి యూరు చూచుటకై నన్నుఁ దన వెంటఁ గొనిపోక మానరు. నేను మఱియొకప్పుడు వచ్చి నీమేనత్తను జూచెదను. అప్పు డామె తనయిష్టము వచ్చినంతసేపు నిలిపి తనకు తెలియని పెద్దపెద్దమాటలు వేసి నాతో సావకాశముగా మాటాడ వచ్చును.

[మంథర మరలఁ బ్రవేశించుచున్నది.]

మంథ—అమ్మా! అమ్మా! వారిద్దఱును మేడమీఁదికే వచ్చుచున్నారు.

కళా—ఇఁక నిన్నిక్కడ నిలుపను. నాప్రాణసఖీ! చారుమతీ! సెలవా? నీరాకను దర్పసారునికిఁ జెప్పివచ్చుటకయి నీవు తొందర పడుచున్నావు. ఇదిగో వేరే మెట్లున్నవి. ఈదారిని క్రిందికి దిగి పో.

చారు—చెలీ! సెలవు. అని కళావతిని కౌఁగలించుకొని వెడలిపోవు చున్నది.)

కళా—ఓసీ! మంథరా! ఈపుస్తకములు తీసిదాచు. వేగిరము! వేగిరము! రుక్మిణీకళ్యాణము పెట్టెలసందునఁ బడవేయుము. విజయవిలాసము పఱుపుక్రింద పెట్టు. భాగవతము సప్తమస్కంధము తెఱచి బల్లమీఁద పెట్టు.

మంథ—పాదుసప్తమస్కంధం లెండి. వంటబ్రాహ్మడు పొస్తకంలో చుప్పనాతికథపట్టు వచ్చేదాకా చింపివేశాడు.

కళా—పోనీ! ఉన్నంతవఱకు తెఱచిపెట్టి గూటిలోనున్న గజేంద్రమోక్షము నామీఁద గిరవాటుపెట్టు. వారువచ్చుచున్నారు. నీవు వెళ్ళిపో.

మంథ—అమ్మా! మంచిది. (అని వెడలిపోవుచున్నది)

[సుభద్రమ్మయు, వీరసేనుఁడును ప్రవేశించుచున్నారు]

సుభ—అదిగోనయ్యా! ఆబుద్ధిహీనురా లక్కడఁ గూరుచున్నది. ఈప్రబుద్ధురాలు కాసుకు గతిలేనినిర్భాగ్యుని పెండ్లిచేసికొని తనవంశమున కంతకు నపకీర్తి తేఁజూచుచున్నది.

కళా—అత్తా! వెనుక నీవిషయమయి నేననుకొన్నది—

సుభ—అమ్మాయీ! నీవేమయిన ననుకొందువు. నీయనుకొనుట లిఁక చాలించు. చిన్నపడుచులు తమమనసు వచ్చినట్లెల్ల ననుకొనుట తప్పు. మేమిప్పుడు నిన్ను ప్రార్థింప వచ్చినసంగతి విను. నీవతని మఱచిపోయెదనని మాచేతిలో చెయ్యి వేయవలెను.

కళా—మఱ పెల్లప్పుడును మనస్సునకు స్వాధీనమయిన పని కాదు. మఱచిపోవలె ననుకొన్నను మఱచిపోవుటమాత్రము కొన్నిసమయములయందు చెప్పినంతసులభము కాదు.

సుభ—తెలిసినదానిని నేను సులభమని చెప్పుచుండఁగా నీవు కాదని నామాట కెదురుచెప్పెదవేమి? నిజముగా తలఁచుకొంటే

మఱచిపోవుట యెప్పుడును కష్టము కాదు. నా పెనిమిటిని నేనెట్లు మఱచిపోయినానో నీ వెఱుఁగుదువా? అస లాయన భూమిమీఁద కొంతకాల మున్నట్టే యిప్పుడు నాకు జ్ఞప్తిలేదు. నీమామగారిని మఱచిపోవలెనని నేను మనఃపూర్తిగా తలఁచుకొన్నాను; వెంటనే మఱచిపోయినాను. వేగముగా మఱచిపోక యెల్లకాలము నొక్కనినే మనస్సులో నుంచుకొనుట నీవంటి కన్నెలకు బొత్తిగా తగదు.

వీర—నీవు మఱచిపొమ్మన్న దాని నొక్కదానిని దక్క మఱి దేనిని నీమేనకోడ లిప్పుడు మనస్సులో నుంచుకొన్నట్టు నటించదు. ఇది యంతయు నీవే చదువుకొన్న విద్యాప్రభావము.

కళా—అత్తా! నన్నిట్లు బాధపెట్టుటకు నేను మీ కేమి యపరాధము చేసినాను?

సుభ—కళావతీ! నీవు మాట మఱపించి తప్పించుకో చూడకు. నీ నేరమునకు నావద్ద తగినంత నిదర్శన మున్నది. దాని కేమిగాని యిఁకముం దయినను నేను చెప్పినట్లు వినెదనని వాగ్దానము చేయుము. నామాట విని మనకు కావలసినవాఁ డీయన చెప్పిన పెనిమిటిని చేసికొనుట కంగీకరించు.

కళా—అత్తా! నీతో నేను స్పష్టముగాఁ జెప్పుచున్నాను విను. నేను కోరుకొన్న వానిని దక్క మఱొక్కనిని వరించుట కెప్పుడును నే నిష్టపడను. మీ రాలోచించిన సంబంధము నాకు సరిపడదు.

సుభ—అమ్మాయీ! వరించుటకును వరించక పోవుటకును కన్నెపడుచవు. నీ యిష్టముతో పని యేమున్నది? ఇష్టానిష్టము లెప్పుడును నీవంటి కన్యల కర్హము లయినవి కావు. అవి సదా మాఱుచుండుట సహజ మయినందున, వివాహవిషయములో సాధా

రణముగా నిష్టములేని వానితో నారంభించుటయే క్షేమకర మన్న సంగతి నీవెఱిఁగి యుండవలసినదే. మొట్టమొదట నేను నీ మామ గారిని పెండ్లి చేసికొన్నప్పుడు నాకాయనమీఁద నిజముగా పెద్దపులి మీఁద నున్నంత ద్వేషము అయినను గూడ యనుకూలదాంపత్య మయినందుకు సందేహము లేదుకదా? భగవంతుఁ డనుగ్రహించి నాభర్తగారిని తనవద్దకు రప్పించుకొన్నప్పుడు నే నెంత బిగ్గరగా నేడ్చినానో కన్నీళ్లు కాలువలు కట్టించినానో నీవే యెఱుఁగుదువు. ఈవఱకు నేను కుదిర్చిన సంబంధము మాని వేసి మేము మఱియొక మంచిసంబంధము చెప్పెద మనుకో. నీవప్పుడును విజయపాలుని వదలివేసెదవా?

కళా—కల్లవాగ్దానములు చేసి నేనొకవేళ నా మనస్సు నబద్ధము చేయఁ గలిగినను, నా చేష్టలుమాత్రము నా పలుకుల నబద్ధములు చేసి నిజమును బయలఁబెట్టక మానవు.

సుభ—పెద్దమనుష్యుల యెదుట సరసముగా మాటాడుటకు నీ వర్హురాలవు కావు. నీవు నీగదిలోనికిఁ బోయి కొఱకొఱలాడుచు నొంటిగా గూరుచుండి నీదూరాలోచనలు చేసికో. పో.

కళా—మంచిది. సంతోషపూర్వకముగా బోయెదను.

(అని లేచి పోవుచున్నది.)

సుభ—ఇప్పుడు మామీఁద పెద్దభారము పడినది.

వీర—ఇందేమియు వింతలేదు. ఇది యంతయు బాలికలకు విద్య చెప్పించుటవలన గలిగిన ఫలము. నాకీశ్వరానుగ్రహము వలన వేయిమంది పుత్రికలు కలిగినను వారిలో నొక్కరికిని విద్య చెప్పింపను.

సుభ—బావగారూ! మీరు కన్యల విషయ మయి తప్పు తలఁచుచున్నారు.

వీర—సుభద్రమ్మా! నేనీదినమున ప్రత్యక్షముగా చూచిన సంగతి యొక్కటి చెప్పెదను విను. నేను మీయింటికి వచ్చుచుండఁగా మీ దాసి నీ మేనకోడలినిమిత్తము పుస్తకముల కొట్టులో నుండి కొన్ని పుస్తకములు కొని తీసికొని వచ్చుచున్నది. పయి యట్టలనుబట్టి యవి యెటువంటిపుస్తకములో నే నప్పుడే గ్రహించి నాను.

సుభ—శృంగారప్రబంధములు.

వీర—అవును. అవి వట్టి పనికిమాలిన పుస్తకములు. అవి చదివినవారు చెడిపోక మానరు. ఆవాసన సోకినతరువాత వానిలో వర్ణింపఁ బడినదాని ఫలము ననుభవింపఁ గోరకుండరు. అందుచేత నే నేను స్త్రీలకు విద్య కూడదనుచున్నాను.

సుభ—మీ రూరక పరిహాసమున కనుచున్నారు. అంతేకాని మీరుమాత్రము స్త్రీలుమూర్ఖురాండ్రుగా నుండవలెనని కోరుదురా?

వీర—అది సరికాని స్త్రీ లెంతవఱకు చదువవలెనని నీయభి ప్రాయము?

సుభ—బాలికలు విద్యలలో పండితురాండ్రు కావలె నని నే నెప్పుడును జెప్పను. వారికి సంస్కృతములోను వేదాంతములోను పాండిత్య మక్కఱలేదు. ఇంటిలెక్కలు వ్రాయుటకు కొంచెము వ్యాకరణము వచ్చియుండవలెను. చదివిన పద్య మర్థము చేసికొ నుటకు కొంచెము గణితశాస్త్రము తెలిసి యుండవలెను; తప్పులు లేకుండ నుత్తరము వ్రాయఁగలుగుటకు కొంచెము తర్కము నేర్చి

కోవలెను. స్త్రీల కింతవఱకు విద్య చాలును. నేను చెప్పినది సరిగా నున్నదా?

వీర—నీవు శాస్త్రపండితురాలవు కనుక, ఈవిషయమయి నీతో నేను వాదులాడను. నీ విప్పుడు చెప్పినప్రతివాక్యములోను నీ పాండిత్యమును బుద్ధివిశేషమును నాకుబోధపడినవి. విద్యావిషయ మటుండనిచ్చి మన మిప్పుడు కార్యాంశమునకు వత్తము. నేను చెప్పినసంబంధమునకు నీకేమియు నాక్షేపణ లేదుగదా!

సుభ—లేదు. ఆవగింజంతయినను లేదు. దామోదరవర్మ విషయమయి నేనూరకే సూచనగాఁ జెప్పినాను గాని యతనికి నేను నిశ్చయముగా మాట యియ్యలేదు. కళావతి తన కతఁడక్కఱ లేదని మూర్ఖపుపట్టు పట్టుచున్నది గనుక, మీ కొడుకువిషయమయి సమాధానపడవచ్చును.

వీర—వెంటనే యిక్కడకు రావలసినదని మావానికి నేఁడే యుత్తరము వ్రాసిపంపెదను. నేను నా మనస్సులో కొంతకాలము నుండి యాలోచించుకొను చున్నను, మావానికి మాత్రమీవిషయ మయి యెంతమాత్రమును తెలియనియ్యలేదు. వాఁడు సేనలో నుద్యోగములో నున్నాఁడు.

సుభ—నే మీవఱ కెన్నఁడును మీ కొడుకును జూడలేదు. అయినను మాసంబంధమునకు మీ కుమారుని కేమియు నాక్షేపణ యుండదనుకొనెదను.

వీర—ఆక్షేపణా? చేతనయిన యెడల నాక్షేపణ చేయుమను చూతము. వాఁ డెప్పుడును నామాట కడ్డు చెప్పఁడు. నామాట కావగింజంత యెదురు చెప్పినపక్షమున, నేనుసహించి యూరకుండు వాఁడను గానని నా దురాగ్రహ మూ విక్రమసేనుఁ డెఱుఁగును.

వాని చిన్నతనములో నేను "విక్రమా! ఇది చేయుము" అని యాజ్ఞాపించెడివాఁడను. వాఁడు తత్క్షణము చేయక యనుమానించిన పక్షమున, అప్పుడే వానిని పడతన్నెడి వాఁడను. ఏడ్చిన పక్షమున, వెంటనే గదిలోనుండి సాగనంపెడివాఁడను. ఎప్పుడును నాపద్ధతి యింతే.

సుభ—అదే నామనసును వచ్చిన మంచిపద్ధతి. కొంచెము కఠినముగా నుండక పోయినపక్షమున, చిన్నవాండ్రు చెప్పినట్టువినరు. ఇఁక దామోదరవర్మ కుద్వాసనము చెప్పి మీకుమారుని ప్రార్థన లాలోచించవలసినదని నా మేనకోడలిని మెడలువిఱిచియొప్పించెదను. బావగారూ! మీరుమాత్రము మీకొడుకుతో నా మేనకోడలు కొంచెము మంకుతనము కలదయినను బుద్ధిమంతురాలని బోధపఱచవలెను.

వీర—ఆవిషయమయి నీవు నాకు బోధ చెయ్యవలసినపని లేదు. నాపని నేను నీచిత్తమువచ్చినట్లు చెయ్యఁగలను. నీవుమాత్రము కొంచెము గట్టిపట్టు పట్టకపోయినయెడల, నీమేనకోడలునీకుస్వాధీనురాలుకాదు. నాబుద్ధి విని నేను చెప్పినట్లు చేయుము. నీమేనకోడలు మంచిమాటలకు లొంగక నాకొడుకు పనికిరాఁ డన్నపక్షమున, మాటాడక గదిలోపెట్టి తాళమువేసి రెండుదివములు నీసేవకు లెవ్వరును దీసికొనిపోయి యన్నము పెట్టకుండునట్లు దిట్టము చేయుము. మూడవదినము నీమేనకోడ లెట్లుచెప్పినట్లు వచ్చునో యప్పుడు నీకే తెలియవచ్చును. మంచిది. నే నిప్పటికి సెలవు పుచ్చుకొనెదను.

(అని వెడలిపోవు చున్నాఁడు)

సుభ—ఏలాగున నయినను నేను దాసిని లోఁబఱుచుకొనవలెను. పురుషోత్తమదేవునిమీఁద నామనస్సు తగిలియున్నట్టది

యేలాగునో కనిపెట్టినది. మంథర నాగుట్టు బయలఁబెట్టియుండదు. నిశ్చయము. అది వట్టివెఱ్ఱిబాగులది. అయినను నిజము దానినోటనే పలికించెదను—మంథరా! మంథరా! (అని పిలిచి) అది రహస్యము వెల్లడి చేయుస్వభావము కలదయినపక్షమున, దానినెప్పుడును నేను నాయొద్దఁ జేర్పకయే యుందును,

[మంథర ప్రవేశించుచున్నది]

మంథ—అమ్మా! పిలిచినారా?

సుభ—పిలిచినాను. నీవు వీధిలోనికి వెళ్ళినప్పుడు నీకెక్కడనైన పురుషోత్తమదేవుఁడుగారు కనఁబడినారా?

మంథ—లేదు. అమ్మా! లేదు. ఆయనమొఖమయినా నేను చూడలేదు.

సుభ—నీవాయనసంగతి యెవరితోను జెప్పలేదుగదా?

మంథ—నేనా? నేనా? ఓయి దేవుఁడా! నేను యెవరితోనైనా చెపితే నాలుక తెగ్గోయ్యవలెను.

సుభ—నీవెఱ్ఱిబాగులతనము చూచి ఎవరైన మోసము చేయుదురుసుమా. భద్రము!

మంథ—అమ్మా!

సుభ—కొంచెముసేపుండి మరలరా. పురుషోత్తమదేవుఁడుగారిపేర నొకయుత్తరము వ్రాసి యిచ్చెదను. ఇతరులరహస్యములను నాతోఁ జెప్పుటయేకాని నీవు నారహస్యములను మఱియెక్కడను జెప్పరాదు సుమా! చెప్పితివా, అమాయకురాలవని నిన్ను క్షమించను. తరువాత నీవు నాయాగ్రహమునకు పాత్రురాలవగుదువు. (అని లోపలికిఁ బోవుచున్నది)

మంథ—అహహహా! నా వెఱ్ఱిబాగులతనమా! నీవు కొంచెంసేపు విశ్రాంతిపొందు. నాతోటివాళ్ళు తాము గడుసువాళ్లు లాగు కనపడడానికి చూచినా నేనుమాత్రం పయికి వెఱ్ఱిబాగుల వేషమే వేస్తాను. నాఅమాయికత్వంవల్ల నాకు యెంతలాభం కలిగిందో చూచుకుంటాను. (కాగితము తీసి చదువుచు) విజయపాలునితో లేచిపోవడానికి సహాయం చేస్తూవున్నందుకు కళావతి యిచ్చినవి యిరవయిరూపాయల రొఖ్ఖమూ రెండుచీరెలూ. విజయపాలుడుగా రిచ్చినవి పదిరూపాయలు—రెండోపద్దు—వారిసంగతి బయలపడడానికి సిద్ధంగా వున్నప్పుడు రహస్యం పట్టియిచ్చినందుకు సుభద్రమ్మగా రిచ్చినవి రెండురూపాయలు— మూడోపద్దు — యిస్తానని చెప్పి యివ్వకుండా దోవలో చింపిపారవేసిన వుత్తరాలు పట్టుకువెళ్ళినందుకయి దామోదరవర్మ యిచ్చినవి రెండురూపాయలు—నాలుగోపద్దు—పురుషోత్తమదేవుడుగా రిచ్చినవి మూడురూపాయలు—ఓ వెఱ్ఱిబాగులతనమా! బాగాచేసినావు నీదయచేతనే నాపురుషోత్తమదేవుణ్ని మేనత్తతో కాకుండా మేనకోడలితోనే తాను వుత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూవున్నట్టు నమ్మేటట్టు చేసినాను.

(అని నిష్క్రమించుచున్నది)

ద్వితీయాంకము

౧. రంగము—విక్రమసేనుని గృహము

[విక్రమసేనుఁడును, రాముఁడును ప్రవేశించుచున్నారు]

రాము—నేను అక్కడ వుండగానే వీరసేనుడుగారు వీధిలోనుంచి వచ్చినారు, మీ క్షేమసమాచారం తెలుసుకు రావడానికి

మీ కొమారుడుగారు నన్ను యిక్కడకు పంపినా రనిన్నీ, తమ దర్శనం చెయ్యడానికి యెప్పుడు సమయంగా వుంటుందో కనుక్కు రమ్మన్నా రనిన్నీ, మనవి చేసినాను.

విక్రి—నే నిక్కడ నున్నానని విన్నప్పు డాయన యే మన్నారు?

రాము—యేమంటారు? ముక్కుమీద వేలు వేసుకుని యెక్కడ లేని హాశ్చర్యమూ పడ్డారు. కొంచెంసేపు అద్భుతపడి నిలుచుండి మావాడు యిక్కడకు యెందుకు వచ్చినాడని అడిగినారు.

విక్రి—నీవేమి చెప్పినావు?

రాము—పెద్ద అబద్ధం చెప్పినాను. చెప్పిన అబద్ధం యేమిటో సరిగ్గా యిప్పుడు జ్ఞాపకం లేదుగాని నా నోటినుంచి నిజంమాత్రం రాలేదు. ఇక ముందయినా పొరబాటు లేకుండా వుండడానికి మనం పిఠాపురం యెందుకువచ్చినామో యేదోవొకటి యిప్పుడే నిశ్చయం చేసికోవలెను. యిప్పుడు వొకటి చెప్పి యింకోమాటు యింకొకటి చెపితే తంటా వస్తుంది. చెప్పే అబద్ధా లయినా వొకదానిని వొకటి పొసగి వుండేటట్టు ఆలోచించి మరీ చెవుతూ వుండవలెను. మరీ ఆయన నవుకర్లు మీరు యిక్కడకు యెందుకు వచ్చినారు యెందుకు వచ్చినా రని పదిసార్లు అడిగినారు.

విక్రి—వాండ్రితో నీవేమియు చెప్పలేదు గదా?

రాము—లేదు లేదు. వొక్కమా టయినా చెప్పలేదు. వాళ్ళల్లో బండివాడు శంకరుఁడు మహానమ్మక మయినవాఁడు.

విక్రి—ఓరి నిర్భాగ్యుఁడా! కొంపతీసి వానినినమ్మి వానితో నీ వేమైనఁ జెప్పినావా యేమి?

రాము—లేదు. వొక్కక్షరం చెప్పలేదు. వూరికే యెవరిని పడితే వాణ్ని నమ్మడానికి నేనంత వెఱ్ఱివాణ్ణనుకున్నారా యేమిటి? నేను మహా గడుసువాణ్ని. నామాట నమ్మండి. వాడుమాత్రం నన్ను నీయజమానుడు యిక్కడికియెందుకు వచ్చినాడని గుచ్చిగుచ్చి అడిగినాడు. మనుష్యులను కుదుర్చుకోవడానికి వచ్చినారని చెప్పినాను. కుదుర్చుకోవడాని కన్నమాటమాత్రం నిశ్చయంగాచెప్పినాను. మగవాళ్ళనో, ఆడవాళ్ళనో, యెవరిని కుదుర్చుకోవడమో మాత్రం చెప్పలేదు. యెవరిని కుదుర్చుకోవడమో జోలిమాలిన సంగతి వాడికెందుకు?

విక్రి—కుదుర్చుకొనుట కన్నమాట సరిపోయినది. యెవ్వరడిగినను నీ వామాటే యిఁకముందును జెప్పుచుండుము.

రాము—సరిపోనిమాట నేను యెన్నడూ చెప్పను. కుదుర్చుకోవడ మన్నది దివ్యమయినమాట. దానికి వన్నె తేవడానికి మీరప్పుడే పదిమంది బంట్లనూ యిరవైమంది తప్పట వాయించే వాళ్ళనూ ముప్ఫయిమంది బాకా వూదేవాళ్ళనూ, కుదుర్చుకున్నారనికూడా చెప్పినాను.

విక్రి—ఓరి మూఢుఁడా! అవశ్యమయినదానికంటె నధికముగా నీ వెప్పుడును జెప్పఁబోకు.

రాడు—క్షమించండి. నా నేరం క్షమించండి. అయినా కానీ మీరు నామనవి వొక్కటి చిత్తగించవలెను. వొకదాన్ని బలపర్చడానికి నాలుగబద్ధాలు వెంటనే వుంటేనేకాని అబద్ధం యెన్నడూ పనికిరాదు. అందుచేత వొకఅబద్ధం చెప్పి నమ్మించడానికి నేను యెప్పుడూ దానికి సాక్ష్యము మరినాలుగు అబద్ధాలు తోడుగా కల్పిస్తూ వుంటాను.

విక్రీ—సాత్య్య మతివిస్తార మయినపక్షమున నమ్మకము మొదలే చెడిపోవచ్చును. కాఁబట్టి నీవు జాగరూకుఁడవయి యుండ వలెను.—దర్పసారుఁడుగారింటికి వచ్చినారా?

రాము—ఆయన పయిన బట్టలు కట్టుకుంటూ వున్నారు.

విక్రీ—ఆయనకు వీరసేనుఁడుగారును చారుమతియు వచ్చిన సంగతి తెలిసినదేమో నీ వెఱుఁగుదువా?

రాము—ఆసంగతి నేనాయనకు తెలిసిందనుకోను. ఆయన యిక్కడకు వచ్చినతరువాత పెద్దాపురాన్నుంచి వచ్చినపెద్దమనిషిని వొక్కరిని తప్ప మఱియెవరినీ యింకా చూడలేదు. మెట్లుచప్పుడవుతూ వున్నవి. దర్పసారుడుగారు కిందికి వస్తూవున్నట్టున్నారు.

విక్రీ—నేనిక్కడ నున్నానని నీవాయనతో చెప్పిరా.

రాము—చిత్తము. (అని పోవుచు) అయ్యా! వొకవేళ వీరసేనుఁడుగారు యీలోపుగా యిక్కడకువచ్చి మిమ్మల్ని అడిగినట్టయితే; మనం మనుష్యులనుకుదుర్చుకోవడానికి వచ్చినామన్నమాట మీరు మరిచిపోకుండా బాగాజ్ఞాపకం వుంచుకోవలెను.

విక్రీ—మంచిది పో.

రాము—నామాట బోటుకాకుండా మీకు సాధ్యమయ్యే పక్షానికి తప్పెటవాళ్ళనూ బాకావాళ్ళనూకూడా పోగుచేసి మీరు యిక్కడ వుంచితే నేను చాలా సంతోషిస్తాను. నా యజమానుడికోసం అబద్ధాలాడడానికి నేను యెప్పుడూ సందేహించకపోయినా, నాఅబద్ధం బయలుపడితేమాత్రం నా మనసుకు చాలా నొప్పిగా వుంటుంది సుమండీ. (అని పోవుచున్నాఁడు.)

విక్రీ—నా మిత్రుఁడు కొంచెము చంచలచిత్తుఁడు. తనప్రియు

రాలు వచ్చినవార్త యతనికిఁ దెలిసి యుండనిపక్షమున, అతనితో జెప్పక కొంతసేపు చిక్కులు పెట్టెదను.

[దర్పసారుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విక్రి—మిత్రుఁడా! సంతోషముగా నున్నది. పీఠికాపుర మునకు నీ వనుకొన్న వేళకే తప్పక మరల వచ్చినావు!

దర్ప—వెళ్ళినపని తీఱినతరువాత నే నక్కడ నిలువవలసిన యావశ్యకము లేకపోయినందున తిరిగి వెంటనే వచ్చినాను. నేను వెళ్ళినతరువాత నిక్కడ విశేషము లేమి? కళావతికిని నీకును నడుచు చున్న వ్యవహార మెట్లున్నది?

విక్రి—పూర్వ మున్నట్లే యున్నది. మా కలహదినము మొదలుకొని నే నామెను మరలఁజూడ నేలేను. అయినను నే నామె యొద్దనుండి సందేశము వచ్చునని ప్రతిక్షణమును ప్రతీక్షించు చున్నాను.

దర్ప—తత్క్షణమే నీతో లేచిరావలసిన దని బోధించియామె నేలయొప్పింపలేవు?

విక్రి—ఏమీ? ఆమె సొత్తులో మూడింట రెండుపాళ్ళు పోఁ గొట్టనా? మిత్రుఁడా! నీ వీసంగతి మఱచిపోయినావు. గట్టిగా తలఁచుకొన్నయెడల నే నామె నీవఱకే లేవఁదీసికొని రాఁగలిగి యుందును.

దర్ప—నీ వూరక కాలమును వ్యర్థపుచ్చుచున్నావు. ఆమె దక్కుట నిశ్చయ మని నీకు నమ్మక మున్న పక్షమున, నీనిజమైన వేషముతో నే పోయి యామె మేనత్తతో నీసంగతిని తెలుపుకొని యనుమతినిమిత్తము నీతండ్రి వీరసేనుని కేల వ్రాయరాదు!

విక్రి—మెల్లగా: మెల్లగా. విజయపాలవేషముతో నున్న నాతో లేచి వచ్చునని నాకు దృఢనిశ్చయ మున్నను; గొప్పసంస్థాన మునకు నేను కర్తను గాఁగలనని తెలిసికొన్నప్పుడు మేనత్త యంగీకారముతో సరియైన వివాహమహోత్సవములతో కళావతి నన్ను భర్తనుగా వరించునన్న నిశ్చయము మాత్రము నా కేవిధముచేతను లేదు. తొందర పడఁగూడదు. ఈపని కయి నే నామె మనస్సును క్రమముగా శిక్షితము చేయవలెను. ఇటువంటి సాహస కృత్యము నకుఁ జొచ్చి కార్యము చెడఁగొట్టుకొనుటకంటె ముందుగా నే నామెను నాతోడిదే లోక మనుకొనునట్లుగాఁ జేయవలెను.— మంచిది. దర్పసాంగా! నేఁడు నీవు మా యింటికి భోజనమునకు వచ్చెదవా?

దర్ప—నేను రాలేను. నేఁడు విందులు కుడుచుటకు తగినంత యుత్సాహస్థితిలో నేను లేను.

విక్రి—నేను నిన్ను విడిచిపెట్టను. నీ వెంత కామాతురుఁడ వయి యున్నను, పురుషగుణముమాత్రము విడిచిపెట్టఁ బోకు. ధైర్యము పురుషలక్షణము.

దర్ప—అది సత్యమే కాని నే నిప్పుడు విందు లారగించుటకు తగినస్థితిలో లే నని నేనే యొప్పుకొనుచున్నాను.

విక్రి—నీవలె నేనుమాత్రము కాముకుఁడను గానా? మదన వికారము నాకుమాత్రము తల కెక్కి నాచేత సాహసకార్యములు చేయించుచుండుట లేదా? అయినను పనికిమాలిన మూఁడుదానివలె నే నెక్కడకుఁ బోయినను నావెంట లేచిపోని యనుమానములను, భయములను, ఆశలను గొనిపోను నా?

దర్ప—నాకువలె నీహృదయ మంతయు తదేకధ్యానముతో నొక్కదానిమీఁదనే నిలిచియుండ లేదు. నీ విప్పు డొక్కచోట పెద్ద

గాలము వేసినావు. అది తప్పిపోయిన పక్షమున వేఱొకచోట వేయుదువు. నీవలెఁ గాక నా బ్రతుకంతయు ప్రాణాధికమైన యొక్క పదార్థముమీఁదనే నిలిచి యున్నది. అది జాఱిపోయిన పక్షమున నేను సర్వవిధములఁ జెడిపోవుదును.

విక్ర—ఛీ! ఊరకుండు. ఇట్టిభయమును పెట్టుకొనుటకు నీ కిప్పుడు క్రొత్తగా నేమి హేతువులు వచ్చినవి?

దర్ప—ఏమిహేతువు లున్న వని యడుగుచున్నావా? నా భయమునకు లక్ష హేతువు లున్నవి. ఆమె యుత్సాహ మెట్లున్నదో, ఆరోగ్య మెట్లున్నదో, ప్రాణ మెట్లున్నదో, అని నేను భయపడుచున్నాను. హా! దైవమా! నా వియోగతాపమును, నా సుఖాగమనకాంక్షయు, ఆమె మృదుహృదయము నెంత నొప్పించుచున్నవో కదా! ఆమె యారోగ్యమును గూర్చి ప్రతిక్షణమును నాచిత్తము తత్తరిల్లుచున్నది. ఆమెది నిరుపమాన కోమల సుకుమార శరీరము. రెండు చినుకులు పడినను, కొంచెము చలిగాలి వీచినను, శైత్యమామె మృదులాంగములను నొగిలింపవచ్చును. మధ్యాహ్న తీక్ష్ణాతపతాపమును సాయంసమయ శీతవాత ప్రకోపమునుగూడ నా ప్రాణములకు ప్రాణమైన యామె ప్రాణముపాలిటి మృత్యుదేవతలు కావచ్చును. తుల్యానురాగముగల కాముకీకాముకు లొండొరుల నెడఁబాసియున్నప్పుడు మలయమారుతము నందును వెన్నెల బయళ్లయందును లీలోద్యానముల యందును దేనియందువారి మనస్సులకు భయహేతువు తోచకుండును.

విక్ర—నీవుచెప్పినది సత్యమే కావచ్చును. కానిమ్ము. చారుమతి మనోల్లాసముతో సుఖముగా నున్న దని నీహృదయమునకు దృఢవిశ్వాసము కలిగినపక్షమున, నీమనస్సు సంతుష్టి పొందునా?

దర్ప—నిస్సందేహముగా నపరిమితానందము పొందును. ఆమె క్షేమవార్త తెలియకయే నాయుల్లమిప్పుడు తల్లడిల్లుచున్నది.

విక్ర—అంతే యయినయెడల నీమనస్సంతాపమును క్షణములో చల్లార్చెదను. నీప్రాణవల్లభ చారుమతి సంపూర్ణారోగ్యదశయందున్నది. అంతేకాక యామె యీక్షణమునం దీపీతికాపురములోనే సుఖురాలయి యున్నది.

దర్ప—ఓయీ! విక్రమసేనా! నన్నెగతాళి చేయకు.

విక్ర—ఎగతాళి కాదు. ఆమె యొకగంటక్రింద మాతండ్రిగారితోఁగూడ నిజముగానే యీగ్రామమునకు వచ్చినది.

దర్ప—నిజముగా నా?

విక్ర—నిన్ను మోసము చేయుటకు వీరసేనుఁడుగారు నీవెఱుఁగనిక్రొత్తవారు కారుగదా? నీతోడు! నిజముగానే వచ్చినది.

దర్ప—మిత్రుఁడా! ఇప్పుడు నీవు నాచెవుల కమృతము పోసినావు. ఇఁక లోకముమీఁద లోకము పడినను నామనస్సునకు విచారము లేదు.

[రాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

రాము—అయ్యా! దామోదరవర్మగారు యిప్పుడేవచ్చి కింద వున్నారు.

విక్ర—ఈదామోదరవర్మ యిల్లు వీరసేనుఁడుగారి యింటికి మిక్కిలి సమీపము. నీవు విడిచివచ్చినప్పటినుండియు నీప్రాణేశ్వరి యెట్లున్నదో యితఁడు చెప్పఁగలఁడు. కొంచెము సేపు తాళు.— రామా! ఆయనను రమ్మను.

రాము—చిత్తము. (అని పోవుచున్నాఁడు.)

దర్ప—ఇతఁడు మీయింట చనువు గలిగి మెలఁగువాఁడా

విక్ర—మిక్కిలి చనవరి యయి సదా మాయింటికిఁ బోవు చుండును. నీవిప్పుడే పోఁగూడదు. ఈతనిచర్య నీకిప్పుడు మహావినోదము గలిగించును.

దర్ప—మంచిది. అతనిని నేనును గొన్నిప్రశ్నలడిగెదను.

విక్ర—ఇతఁడు నాకు ప్రతిపక్షనాయకుఁడుసుమా! అనఁగా నాఅపరావతారుఁడయిన విజయపాలుని కన్నమాట. తనమిత్రుఁడయినవిక్రమసేనుఁడెప్పుడయినఁ గళావతినిజూచి యుండవచ్చు నన్నమాటనే యీతనిమనస్సునకు తట్టలేదు. తనశత్రువయినవిజయపాలుఁడు ప్రచ్ఛన్నవేషముతో తనప్రియురాలివిషయమయి కృషి చేయుచున్నాఁడని యీతఁడు నాతో మొఱ్ఱ పెట్టుకొనుచుండుట యెంతో నవ్వులాటగా—

దర్ప—చాలు. ఊరకుండు. అతఁడు వచ్చుచున్నాఁడు.

[దామోదరవర్మ ప్రవేశించుచున్నాఁడు.]

దామో—ఓహో! నాప్రాణమిత్రుఁడా? విక్రమసేనా! సుఖముగా నున్నావా? నేనింతకుముందే యిక్కడకు వచ్చినాను. మహావేగముగా వచ్చినాను. బెత్తములు గుఱ్ఱములవీపులమీఁదవిఱిగి పోయినవి. త్రోవపొడుగునను దుమ్ము మేఘములవలె లేచినది.

విక్ర—అవునవును. నీవా మేఘములలో మెఱుపులాగున వచ్చినావు. నిన్నింత వేగముగా నిక్కడ కాకర్షించిన యయఃకాంత మేదో నే నెఱుఁగుదును. నీ వీదర్పసారుని నెఱుఁగుదువా? దర్పసారా! ఇతఁడు దామోదరవర్మసుమా!

దామో—మీదర్శనలాభము కలిగినందున నాకు బహుసంతోషముగా నున్నది. మీరునన్ను మీస్నేహితునిగా నంగీకరింపవలెను. విక్రమసేనా! ఈదర్పసారుఁడుగారివృత్తాంతము కొంచెము చెప్పెదవా?

విక్ర—ఇతఁడు మనచారుమతి హృదయేశ్వరుఁడు.

దామో—అలాగా? చారుమతియు నీంతండ్రియు నాకంటె రెండడుగులు ముందుగా నీగ్రామమునకు వచ్చినారు. ఓదర్పసారా! నీవదృష్టవంతుఁడవు.

దర్ప—చారుమతిని నేనింకను చూడలేదు. ఆమె క్షేమముగా నున్నదిగదా?

దామో—కావలసినంత క్షేమముగా నున్నది. ఆమెముఖవర్చస్సిప్పటికంటె తేటగా మఱి యెప్పుడు నుండలేదు.

దర్ప—ఈమధ్య నామెదేహ మేమో కొంచె మస్వస్థముగా నున్నదని విన్నానే.

దామో—ఎవ్వరు చెప్పినారోగాని మీరువిన్న దబద్ధము. మీమనస్సునకు నొప్పి కలిగించుటకై యూరకే చెప్పి యుందురు. ఆమె యస్వస్థత యన్నమాటయే యెఱుఁగదు.

దర్ప—విక్రమసేనా! చూచినావా? ఆమెమనస్సు నాదానికంటె దృఢమయినది. నేనిక్కడ నేమియు తోఁచక యస్వస్థముగా నుండఁగా నామె యక్కడ నెంత స్వస్థముగానున్నదో విన్నావా?

విక్ర—నీప్రియురా లారోగ్యము కలిగి యున్నదని నీకు వ్యసనముగా నున్నదా యేమి?

దర్ప—కాదు కాదు. నాయభిప్రాయమును నీవు గ్రహించలేదు. ప్రాణవల్లభు లెడఁబాసి యున్నప్పుడు ప్రియురాండ్రు మనస్సులోఁ గొంచె మస్వస్థముగా నుండుట యసహజము కాదుగదా! ఆమెయంత యారోగ్యముగలదై సంతోషముగా నుండుట యనురాగవిశేషమునకుఁ గొంచెములోప మగునో కాదో నీవే చెప్పు.

విక్ర—నీ పూరలేనప్పుడు రోగపడకుండుట యామెది గొప్ప తప్పిదమే!

దామో—చక్కఁగా చెప్పినావు.

దర్ప—చారుమతి యుల్లాసముగా నున్నదని మీరు చెప్పినారుగదా? ఆమె నిర్విచారముగా నవ్వుచు త్రుళ్ళుచుఁగూడ నుండి యుండును. ఉన్నదా?

దామో—ఆమె యెప్పుడును నవ్వులాట మాటలు చెప్పి యందఱకును వేడుక కలిగించుచుండును. పదిమందిలో సంభాషణ కెల్ల నామెయే ప్రాణముగా నుండుచు వచ్చెను.

దర్ప—విక్రమసేనా! చూచినావా? నవ్వులాటమాటలట! చారుమతియే సంభాషణకెల్ల ప్రాణమట! నే నూర లేనప్పు డట! వేడుక లట!

విక్ర—అయినదా? నీమాట లసందర్భములుగా నున్నవి. ఇంతకుముందు నీవు చారుమతి వ్యసనముగా నుండినదేమో యని విచారపడినావు. ఇప్పుడు వ్యసనముగా నుండకపోయిన దని విచారపడుచున్నావు.

దర్ప—విక్రమసేనా! పదిమందిలో సంభాషణకు నేనెన్నఁడయిన ప్రాణముగా నున్నానా?

విక్ర—లేదు. ఎప్పుడును నుండలేదు.

దర్ప—నేనెవ్వరికైన వేడుకను కలిగించినానా?

విక్ర—లేదు. అట్టిపాపము నీ వెప్పుడును కట్టుకో లేదు.

దర్ప—నీ వెఱిఁగినంతవఱకు నే నెన్నఁడయిన నొక్కనవ్వులాటమాట యయినఁ బలికినానా?

విక్ర—లేనిమాట చెప్పరాదు. నీ వెప్పుడును జడునివలె మొగము ముడుచుకొని యుండెడువాఁడవు గాని యెుకప్పుడును నవ్వు వచ్చెడిమాట యొక్కటి యైనను పలికి యుండలేదని నేను ప్రమాణముచేసి చెప్పఁగలను.

దామో—ఈయన యిట్లు మాటాడుచున్నాఁ డేమి?

విక్ర—మ ఱేమియు లేదు. చారుమతి సుఖముగా నున్నదని విని తన తృప్తిని తెలుపుచున్నాఁడు. అంతే.—అవునా? దర్పసారా!

దర్ప—అవును. ఆమె సుఖవార్త విని నేను సంతోషించు చున్నాను. అవు నవును. ఆమె యెప్పుడును సుఖస్వభావురాలు.

దామో—ఆమాట నిజమే. ఆమె యేడుపుమొగ మెప్పుడును బెట్టదు. బహుకళలయం దామె సమర్థురాలు. ఆమె కంఠస్వరము మృదువై యత్యంత మధురమయినది. ఆమెవీణమీఁద వ్రేళ్ళు చిగుర్చునట్లుగాను రాళ్లు కరఁగునట్లుగాను పాడఁగలదు. ఆమె మొన్న త్రిపురసుందరమ్మగారి యింటివద్ద కర్ణసాధనముగా వీణవాయించి పాడునప్పటికి విన్నవా రందఱును చిత్రప్రతిమవలె నిశ్చేష్టులైపోయినారు.

దర్ప—విక్రమసేనా! దీని కేమిచెప్పెదవు? ఆమె తనపాట లేమో వినోదములేమో కాని నాపైరైననుతలపెట్టినట్టు కానరాదు.

విక్ర—ఓయీ! సంగీతము కామోద్దీపకము కాదా?

దర్ప—అయి యుండవచ్చును — అయ్యో! — పాడుపేరు మఱచిపోయినాను. ఈయనపే రేమి?—అప్పుడు చారుమతి పాడిన పాటలేవో మీరు చెప్పఁగలరా?

దా మో—నేను చెప్పలేను.

దర్ప—అవియేవో శృంగారగీతము లయి యుండును. ఆమె "నతాళలేనే" అన్న పదము పాడినదేమో స్మరణకు తెచ్చుకొండి.

దామో—ఆపదము పాడలేదు.

దర్ప—"ఓశుకములారా! పికములారా!"—ఇది పాడిన దేమో! (అని పాడుచున్నాడు)

దామో—ఇటువంటి వేవియు పాడలేదు. ఆమె పాడిన పాటలలో నా కిప్పు డొక్కముక్క జ్ఞప్తికి వచ్చినది. "ఓ మనసా! న న్నేలబాధించెదవే"—అని పాడినది.

దర్ప—నేను వట్టి బుద్ధిహీనుడను. అటువంటి వేడుక కత్తెను నమ్మి సుఖపడ గోరుచుండుటచేత నేను నిస్సందేహముగా బుద్ధిహీనుడనే. పొరుగువారి వినోదము కొఱ కింటింటికి బోయి పెండ్లి పేరంటాలివలె పాటలు పాడుటనుగూర్చి యిప్పుడు నీ వేమి సమాధానము చెప్పగలవు?

విక్ర—నీప్రాణవల్లభవలె నాప్రియురాలంత సంతోషముతో పాటలు పాడుచుండిన పక్షమున నేను పరమానందభరితుడనై యుందును.

దర్ప—ఆమె సంతోషముగా నుండి పోయిన దని నాకు విచారములేదు. ఆవిషయమయి నాకును సంతోషముగా నేయున్నది. ఆమె విచారముగా నుండవలెనని కాని వ్యాఘ్రగ్రస్తురాలు కావలె నని కాని నాకోరిక కాదు. అయినను నాయం దనురాగము గల చిన్నది నా విరహదశలో నటువంటి మంచిపాట పాడక, కొంచె మనారోగ్యముగా నుండి, పరిమిత మయిన సంతోషమును పొంది యుండవలసినది. అటువంటిపాట పాడిన చిన్నది కొంచె మభినయము కూడ పట్టియుండక మానదు. అందుకు సందేహము లేదు.

దామో—ఏమి! ఈయన యభినయమును గూర్చి యేమో యడుగుచున్న ట్లున్నాఁడు!

విక్రి—మనమిప్పుడు చెప్పుకొనుచున్న చిన్నదిపాటమాత్రమే కాక యభినయముకూడ పట్టిన దనుచున్నాఁడు.

దామో—చారుమతి మొన్న పాడినప్పుడు పట్టినయభినయము ముద్దులుమూటకట్టిన ట్లున్నది.

దర్ప—హా దైవమా! నే ననుకొన్నట్లే జరిగినది! విక్రమసేనా! నీతో నేనన్నానా! నేనన్నయక్షరము లన్నియు నయినవి. అభినయమా? ఎంతపని! ఆమె వర్తన మంతయు నాదానికి ప్రత్యుత విరుద్ధముగానున్నది. నేను రేయింబగ ళ్ళస్వస్థముగాను, చిరాకుగాను, వ్యసనముగాను ఉన్నాను. ఆచిన్నది స్వస్థముగాను, ఉల్లాసముగాను, నిర్విచారముగాను, ఉన్నది. ఆమె మాటలును పాటలును నాకు తల కంటగించు చున్నవి.

విక్ర—ఓదర్పసారా! నీయవివేకమును వెల్లడిపఱుచుకొనకు. పదిమందిమిత్రులుచేరి వినోదముకొఱ కొకపాట పాడుచున్నప్పుడు, వారిని సంతోషపెట్టుట కయి యొకపాట పాడినమాత్రమున తప్పేమున్నది!

దర్ప—మంచిది. నేనిఁక నోరు విప్పను. మనసువచ్చినన్ని పాటలు పాడి యామె యితరులను సంతోషపెట్టనిమ్ము. —దామోదరా! ఏమి! నీవు చారుమతిపాటలు మిక్కిలి మెచ్చుకొనుచున్నావే!

దామో—హృదయరంజకముగా నుండుటచేత నామెపాట నా కెంతయైనను మెచ్చుకోఁదగియే యున్నది. ఆచిన్నదాని నేత్రాభినయ మన్నిటిలోను—

దర్ప—నేత్రాభినయము నీమననువచ్చినట్లున్నది కాఁబోలును! ఓయీ! విక్రమసేనా! ఈమాట కేమియుఁ జెప్పవేమి? చేతనైన పక్షమున దీనికి సమాధానము చెప్పు నేత్రాభినయ మట! ఇప్పు డెవరిదో తప్పిదము తేటపడినదా? దీనికిని నేను సహించి యుందును గాని—అక్కడ ననేకులు పడుచువాం డ్రుండి యుందురు.

విక్రి—అనేకులు నీతాతముత్తాలంత వాఁడుగల పడుచు వాండ్రు—

దర్ప—అనేకులతోఁ బనిలేదు. దుష్టుఁ డైనపడుచువాఁ డొక్కఁడున్నఁజాలును. వాఁడే యెంతహానినైనను జేయఁజాలును. ఇఁక నేనిక్కడ నుండలేను—నామనసు దడదడ లాడుచున్నది. నా గుండెలు కొట్టుకొనుచున్నవి.—నాస్థితి యీమహానుభావున కప్పుడే పొడకట్టినది. నేను పోయెదను. (అని లేచుచున్నాఁడు)

విక్రి—దర్పసారా! నీవు కొంచెముసేపు తాళినీకీశుభవార్త చెప్పినందుకు దామోదరవర్మకు వందనములు చేసి మరి పో.

దర్ప—అతని శుభవార్త తీసికొనిపోయి తగులబెట్టు మను.
(అని వెడలిపోవు చున్నాఁడు.)

విక్రి—అహాహాహాహా! పాపము! అయిదునిమిషములక్రిందట దర్పసారుఁ డెంతో సంతోషముగా నున్నాఁడు.

దామో—తనప్రియురాలిని నేను పొగడినందున కాతనికి కోపము రాలేదుగదా?

విక్రి—నీమీఁద కొంచె మనుమాన పడ్డాఁడు. అంతే.

దామో—అనుమానమా! ఆహాహాహా! నామీఁదనా? నీవు నన్ను వేళాకోళము చేయుచున్నావు.

విక్ర—అతఁ డనుమానపడుటకు సందేహమేమి? నీవాశ్చర్యమును శరీరసౌందర్యమును యౌవనవతు లయినబిత్తరులచిత్తముల నట్టాఁత లూఁచక మానవు.

దామో—ఆహాహాహా! నీవు పరియాచక మాడుచున్నావు. ఆహాహాహా! చిత్తముల నట్టాఁతలూఁచుటా? ఇప్పుడు నాశరీరము నాసొత్తు కాదు. దాని నీవఱకే నాప్రాణేశ్వరి యైనకళావతి దక్కించుకొని తనసొత్తు చేసికొన్నది. పరమఛాందసుఁ డయినమాతండ్రిగారి భయమువల్ల మాగ్రామములో నేను మీసములు గొఱిగించుచు వచ్చుటచేత నామొగ మప్పుడు కొంచె మందము తక్కువగాఁ గనఁబడుచు వచ్చెనుగాని యిప్పుడిక్కడ నిర్భయముగా మీసములు పెంచి సంపంగినూనె రాయుటచేత నాముఖమున కెంతయుందమైనను వచ్చినది.

విక్ర—ఆలాగుననా?

దామో—మఱేమనుకొన్నావు? సంపంగినూనెమూలమున నాయెదిగీయెదుగనిమీసము లిప్పుడు నిగనిగ లాడుచున్నవి. కని పెట్టినావా?

విక్ర—ఓహో! యువతులు వలచి పయినిబడునట్లుగా నీ విప్పుడు నీరూపమునకు మెఱుఁగు పెట్టుచున్నావు. తెలిసినది.

దామో—ఈ క్రొత్తమీసములతో నాముఖమున కిప్పుడు క్రొత్తపౌరుషముకూడ వచ్చినది ఆవిజయపాలుఁడుగాఁ డిప్పు డొక్కసారి నాకంటఁ బడెనా, నామీసములతోడు! నాపౌరుష మతనికిఁ దేట పడునట్లు చేయుదును.

విక్ర—నీవి యిప్పుడుపౌరుషముగల మాటలవలెనే యున్నవి. అవునుగాని, దామోదరవర్మా! నీ వీక్రొత్తరయి లెప్పుడు నేర్చుకొన్నావు?

దామో—అహాహాహా! నీవది కనిపెట్టినావా! ప్రాఁతయొట్లన్నియు ఖాత్రిగా పాటి తప్పిపోయినవి. దైవముతోఁడని, గురువుతోఁడని, ఎల్లవారును కల్లయొట్టు పెట్టుకొనుటచేత వానిగౌరవముపోయిందని యొక పెద్దమనుష్యుఁడు మొన్న నాతో ననుటచేత నాయొట్లకు గౌరవము కలుగుటకయి మీాసములతోఁడని యొట్టు పెట్టుకున్నాను. ఇది బాగున్నదా?

విక్ర—దివ్యముగా నున్నది. ఈ క్రొత్తయొట్లతో నిఁక లోకములోని ప్రాఁతయొట్లన్నియు పడిపోవుటకు సందేహ ముండదు.

దామో—కాలమహిమచేత నేమైనను కావచ్చును. కాలవశముచేత పురాతనాచారములకు గౌరవముతగ్గి నూతనాచారములకు గౌరవము హెచ్చుట స్వభావము. శీఘ్రకాలములోనే యిఁక "దైవముతోఁడు" మొదలయినవాని కాలము పోవచ్చును.

[రాముఁడు ప్రవేశించుచున్నాఁడు]

రాము—అయ్యా! ఒక పెద్దమనిషి తనకోసం వచ్చి కింద నిలుచున్నారు. ఆయనను పయికి రమ్మనవచ్చునా?

విక్ర—అవవచ్చును.

దామో—యిఁక నేను పోవలెను.

విక్ర—అక్కఱలేదు. ఉండు—రామా! ఆ వచ్చినవారెవరు?

రాము—మీాతండ్రిగారు.

విక్ర—ఓరిగాడిదా! ఆయనను వెంటనే యెందుకు పయికి రమ్మన్నావు కావు?

రాము—ఇప్పుడంటాను. (అని వెళ్ళుచున్నాఁడు)

దామో—నీవు మీాతండ్రిగారితో మాటాడ వలెను

కాఁబోలును. నాకు సుభద్రమ్మగారి వద్దనుండి మాయింటికి వర్తమానము రావలసియున్నది. నా మిత్రుఁడైన పురుషోత్తమదేవుఁడు గారిని మాయింటికి రావలసినదని నేను చీటికూడ వ్రాసివచ్చినాను. విక్రమసేనా! ఇప్పటికి నాకు సెలవిమ్ము. మనము సాయంకాలము మరలఁ గలిసికొందము. అప్పుడు నీవు కళావతియొక్క సుఖవార్తను విని సంతోషింతువు గాని లే.

విక్ర—అందుకు సందేహపడకు. నేను మనఃపూర్తిగా సంతోషించెదను.

దామో—సెలవు. (అని పోవుచున్నాఁడు)

విక్ర—(తనలో) ఈయన యిప్పుడు కొడుకుకేదో పెద్ద యుపన్యాసము చదువుటకు వచ్చినారు. నేనిక్కడ కేందునిమిత్తము వచ్చినానో యీయనకుఁ దెలియకుండిన బాగుండును. ఈయన వాయువునొప్పులచేత స్వగ్రామమును విడిచి రాలేకుండిన యెడల నేను పరమానందమును బొంది యుందును.

[వీరసేనుఁడు ప్రవేశించుచున్నాఁడు]

విక్ర—తమరి నిక్కడ చూడఁగలుగుటచేత నాకెంతో సంతోషముగా నున్నది. మీరిప్పు డారోగ్యదశయందున్నట్లే కనఁబడుచున్నారు. తమ రిక్కడకు హఠాత్తుగా వచ్చినట్లు విన్నప్పుడు మీ దేహస్థితి యెట్లున్నదో యని నాకు భయము కలిగినది.

వీర—నీ మొగము చూడఁగా నీవు భయపడినట్లే తోఁచుచున్నది. నీవిక్కడకు పనిమీఁద వచ్చినావా?

విక్ర—పనిమీఁదనే వచ్చినాను.

వీర—విక్రమా! నీ విక్కడ నుందువని నేనెంతమాత్రము ననుకొనకపోయినను, సమయమునకు నీవు వచ్చుటచేత నాకుసంతోష

ముగా నున్నది. ఒకచిన్న పనియుండి యిక్కడకు రమ్మని నీకు వ్రాయవలె ననుకొన్నాను. నేనంతకంతకు పెద్దవాఁడ నగుచున్నాను; నా కవయవపటుత్వము తగ్గుచున్నది; కాఁబట్టి నేనిఁక చిరకాలము నిన్ను బాధపెట్టుచు బ్రతుకను.

విక్ర — మీవంటిపెద్దలు పైనుండి యాజ్ఞ పెట్టుచుండుటయే సదా నావంటిచిన్నవాండ్రకు క్షేమకరము. అయినను మీరిప్పుడు మంచియారోగ్యదశలో నున్నట్టే కనఁబడు చున్నారు. మీరెప్పుడు నింతకంటె నెక్కువ దృఢముగానుండలేదు. ఎల్లకాలము మీరీప్రకారముగా నుండవలె ననియే నేను దేవుని ప్రార్థించుచున్నాను.

వీర — దేవుఁడు నీప్రార్థన ఫలింపఁజేయవచ్చును. అట్లయిన పక్షమున నీయభీష్టప్రకారముగా నేను దార్ఢ్యముతో చిరకాలము జీవించి నిన్ను బాధించుచునే యుండెదనులే. నీకు జీతము తక్కువ, నీజీతమును నేను పంపెడుసొమ్మును నీయిష్టమువచ్చినట్లు వ్యయము చేసికొనుటకు చాలవని నే నెఱుఁగుదును.

విక్ర — మీకు నాయందుఁగల దయాతిశయమునకు సంతోషించుచున్నాను.

వీర — నేను బ్రతికియుండఁగానే లోకములో నీవు గొప్పవాఁడవు కాగా చూడవలెనని నాకోరిక. కాఁబట్టి తగినస్థితియిచ్చివెంటనే నిన్ను స్వతంత్రునిగాఁ జేయవలెనని నేను నిశ్చయించుకొన్నాను.

విక్ర — మీకృపాతిశయముచేత నా దేహము పరవశ మగుచున్నది. మీరిప్పుడు చూపఁదలఁచుకొన్న పుత్రవాత్సల్యమువలనఁ గలిగిన కృతజ్ఞత నాహృదయములో చిరకాలమునుండి నిండియున్న పితృభక్తిని ద్విగుణము చేయుచున్నది.

వీర—నీపితృభక్తికి నాకు సంతోషమయినది. కొన్నివారము లలోనే మనసంస్థానమునకు నిన్ను పెద్దనుగాఁ జేయఁబోవుచున్నాను.

విక్ర—నాకృతజ్ఞత నిప్పుడు మాటలతోఁ జెప్పుట శక్యము కాదు. ముందు మీరంతయు నావర్తనచేతనే చిత్తగించెదరు. నా యుద్యోగము మానివేయవలసినదని మీరు చెప్పరని తలఁచెదను.

వీర—అది నీభార్యయిష్టము.

విక్ర—నాభార్యా!

వీర—ఉద్యోగము మానివేయుట నీ యిష్టము నీ భార్య యిష్టము. మీరిద్దఱు నాలోచించుకొని మీ యిష్టమువచ్చినట్లు చేయవచ్చును.

విక్ర—నాభార్యా! మీ రిప్పు డన్నమాట భార్యయని కాదుగదా?

వీర—అదే. నీభార్యయనియే నే నన్నాను. ఆవిషయమయి యీవఱకు నేను నీతోఁ జెప్పలేదు.

విక్ర—లేదు. ఒక్కమా టయినను జెప్పలేదు.

వీర—ఈవఱకుఁ జెప్పకపోయినను, ఇప్పుడు స్పష్టముగాఁ జెప్పుచున్నాను. నిన్ను స్వతంత్రునిగాఁ జేయఁదలఁచుకొన్నా నని నే నన్నమాట నాయర్థమదే. భార్య వచ్చుటయే నీకు భాగ్యము పట్టుట. భార్య వచ్చుటవలన నీస్వాతంత్ర్యమునకు భంగమురాదు.

విక్ర—అయ్యా! అయ్యా! మీమాటవలన నాకు మతిభ్రమ కలుగుచున్నది.

వీర—ఓరి బుద్ధిహీనుఁడా! నీకు వెఱ్ఱియెత్తుచున్నదా యేమి? ఇంతకుముందు నీవు కృతజ్ఞతయంతయు నీయందే మూర్తీభవించి నట్లు మాటాడినావే.

విక్ర—నే నట్లే మాటాడినాను. మీారీవఱకు స్వాతంత్ర్య మనియు భాగ్య మనియు సెలవిచ్చినారు గాని భార్యనుగూర్చి యొక్క మాటయైనను జెప్పలేదు.

వీర—భార్యయని చెప్పుటచేత నిప్పుడు నీభాగ్యమున కేమి నష్టము వచ్చినది? నీకు భాగ్యము వచ్చినప్పుడు దాని కాధారమయిన జీవధన మెట్లు రాకుండును?

విక్రి—నాసౌఖ్యమునకు భంగము వచ్చెడుపక్షమున. నే నట్టి భాగ్యమునైనను తృణప్రాయముగా నిరాకరించవలసినదే. నన్ను ధన్యునిగాఁ జేయఁదలఁచుకొన్న యాచిన్నది యెవరు?

వీర—ఆచిన్నది యెవరో నీ కెందుకు? ఆచిన్నది యెవరైనను నీ వా కన్నెను వరించి వెంటనే వివాహ మాడెద నన్నమాట మాత్రము నాతో చెప్పు.

విక్రి—నే నెఱుఁగని కాంతను కామించి వరింపుమని చెప్పుట మీాకు ధర్మముకాదు.

వీర—నీ వెఱుఁగని కాంతను వరింప నని నిరాకరించుట నీ కంతకుమునుపే ధర్మముకాదు.

విక్ర—అట్లయినపక్షమున మీాతో నేనొక్కసంగతి మనవి చేయవలెను. ఈవఱకే నామనస్సు వేఱొక కన్యమీాఁద తగిలి యున్నది. నాపాలిటి యా భాగ్యదేవతను చెట్టపట్టుటకు నాహృదయము కృతనిశ్చయ మయినది.

వీర—ఆనిశ్చయమును మానుకొనుట కేదో సాకు కల్పించుమని నీ హృదయమునకు బోధించు, నీహృదయము మొట్టమొదట కొంత ఖేదపడవచ్చును గాని తరువాత ననివార్య మయిన యాజ్ఞ చేత నామెసేవను వదలుకో వలసినదై సమాధాన పడును.—

విక్ర—నే నామెతో నెన్నో శపథములు చేసినాను.

వీర—నీ శపథములకు మాఱుగా నీ భాగ్యదేవతయు నీకంటె నెక్కువశపథములు చేసియుండును గాన, నీ కందువలన వచ్చెడు నష్టము లేదు. కామాతురులు చేసెడు శపథము లెప్పుడును చెల్లింపఁ దగినవి కావు, కాఁబట్టి నీశపథము లామెశపథములలో చెల్లు పెట్టుకొమ్మను.

విక్ర—నే నొక్క విన్నపము చేసెదను. మీరు కోపపడక క్షమించవలెను. ఈయొక్కవిషయములో మాత్రము మీయాజ్ఞను నేను మన్నింపఁజాలను.

వీర—విక్రమా! ఇంతవఱకును నీమాటలు శాంతివహించి విన్నాను. ఇఁక నేను శాంతత వహింపఁజాలను. నామాట కెదు రాడనంతవఱకును నేను శాంతమూర్తిని. నామాట కెదురుచెప్పిన తరువాత నాకు శాంతియు గీంతియు నుండదు. నిష్కారణముగా నాకు కోపము తెప్పించఁబోకు.

విక్ర—అయ్యా! ఈవిషయములోమాత్రము మీయాజ్ఞను నేను మన్నింపఁజాలను.

వీర—పో! నాబొందిలో ప్రాణముండఁగా నిన్నిఁక 'విక్రమా' అని పిలిచినపక్షమున, నన్ని పేరుకఁ బిలువఁబోకు.

విక్ర—నామనవి చిత్తగింపవలెను.

వీర—ఇఁక నీ మాట వినను. నీనోటినుండివచ్చిన యక్షర మొక్కటి వినను. నేను చెప్పినదాని కొప్పుకొన్నపక్షమున, తల యూఁచు. లేనిపక్షమున—

విక్ర—మొగమైనను చూడకమునుపే నేను దేనినో కురూపిని గట్టుకొనుట కొప్పుకోనా!

వీర—నోరుమూసికో. పెండ్లికూఁతురు నామనస్సువచ్చినంత కురూపిణిగా నుండనీ. ఆ చిన్నదానికి రెండుభుజములు మీఁదను రెండు కంతులున్నవనుకో; గడకఱ్ఱలాగున పొడుగుగా నున్నదనుకో; కుడికంటిలో కుంకుడుకాయంత కాయ యున్నదనుకో; గడ్డమును మీసములును గలిగి ముడుతలుపడ్డ ముసలిచర్మము కలదనుకో. ఇన్ని యవలక్షణము లున్నను నేను వరింపుమన్న చిన్నదానిని నీవు రాత్రిందివములు బట్టువలె పొగడుచు పద్యములుచెప్పి సౌందర్యవర్ణనము చేయవలసినదే.

విక్రి—కుమారుని విషయమై యిట్లు నిర్బంధపెట్టుట తండ్రికి ధర్మముకాదు.

వీర—ఓరిగాడిదా! నీయధికప్రసంగము చాలించు. ఊరక ప్రేలకు.

విక్రి—జన్మమెత్తిన తరువాత నాకింతదుఃఖ మెప్పుడును కలుగలేదు.

వీర—అబద్ధ మాడుచున్నావు, నిజముగా నీమనస్సులో నీవు సంతోషించుచునే యున్నావు. నేను కొంచె మావలికిఁ బోఁగానే నన్ను చూచి పండ్లికిలించి తప్పక నవ్వెదవు. నే నెఱుఁగుదును.

విక్రి—పెద్దలయెడల నెట్లు ప్రవర్తింపవలయునో నే నెఱుఁగుదును.

వీర—ఆగ్రహపడఁబోకు. కొంచెము శాంతిపడు. నీకోపము గీపము నావద్ద పనికిరాదు.

విక్రి—కోపము లేదు. నాజన్మమధ్యమున నిజముగా నేనింత శాంతత యెప్పుడును వహించి యుండలేదు.

వీర—ఇది శుద్ధాబద్ధము. నీమనస్సులో నీకిప్పుడు కావలసినంతకోప మున్నది. ఆకోపము నాముందు సాగదు.

విక్ర—దయచేసి నామనవి చిత్తగించవలెను—

వీర—నీమనస్సులో నున్నదంతయు వెడలఁగ్రక్కవలె ననుకొనుచున్నావేమి? నావలె కొంచెమునీవు శాంతుఁడవయి యుండలేవా? కోపమువలన కార్యమేమియు లేదు. ఓరిగాడిదా! ఓరిచండాలుఁడా! కోపమువలన మేలు కలుగునురా? ఓరిమూర్ఖుఁడా! ఓరినిర్భాగ్యుఁడా! ముగ్ధునివలె మానమువూని నీకోపము వెల్లడించుకొనుచున్నావు. నాకు కోపము తెప్పింపఁబోకు. నాశాంతస్వభావమును జూచి నీవు నిర్భయముగా చెలరేఁగుచున్నావు. నాపరమశాంతత నీకు లోకువయినది. ఇటువంటిచర్యలవలన పరమశాంతుఁడయినమహర్షికి సహితము కోపము రాకమానదు. నామాట విను. ఆలోచించుకొనుటకు నీకాఱుగంటలకాలము గడువిచ్చినాను. ఈగడువులోపల నీవు బుద్ధితెచ్చుకొని మాఱుమాటాడక నేను చెప్పినదానికెల్ల నొప్పుకొన్నపక్షమున, నేను నిన్ను క్షమించవచ్చును. తొందరపడఁబోకు. నామాటకు సమాధానపడనిపక్షమున, ఇఁక నీవు నాయింట నడుగుపెట్టఁగూడదు. నేను మందెప్పుడును నీమొగము చూడను. నీపని తీయించివేసెదను. నీకు చిల్లిగవ్వలేకుండ నాసొత్తితరులకు వ్రాసి యిచ్చెదను. నిన్నీభూమిమీఁద నిలువనియ్యను. నిన్ను సుఖముగా బ్రతుకనిచ్చినయెడల నాపేరు మాఱుపేరు పెట్టు.

(అని వెడలిపోవుచున్నాఁడు.)

విక్ర—ఈయన దొడ్డతండ్రి; పరమశాంతుఁడు. నాయనా! నన్నింతటితో విడిచిపెట్టినందుకు నీకు పదివేలనమస్కారములు. పెండ్లివిషయములో కొడుకునకు బుద్ధిచెప్పుట చక్కగానే యున్నది.

ఎవతెనో పెద్దదానిని ధనవంతురాలిని నా కీయన కట్టిపెట్టఁదలఁచు కొన్నాఁడు. ఈయనమాత్రము చిన్నతనములో నితరవిచారములు మాని యకృత్రిమానురాగముచేత తనమనసు వచ్చినకన్యనే భార్యనుగా కోరి తెచ్చుకొన్నాఁడు! అట్టివాఁడు కన్నకొడుకువిషయములో నన్యథా తలఁచుట వింతగా నున్నది.

[రాముఁడు మరలఁ బ్రవేశించు చున్నాఁడు.]

రాము—అయ్యా! అయ్యా! మీతండ్రిగారు మహాకోపముతో వెళ్ళిపోతూవున్నారు. నోట్లోయేమిటో గొణుక్కుంటూ దబదబ మెట్లు దిగి నేను దోవలో అడ్డం వుండేటప్పటికి నానెత్తిమీఁద వక్కచదువు చరిచి కావలిస్తే నీయజమానుడితో చెప్పుకోపొమ్మని. నన్ను తోసుకొని వెళ్ళిపోయినారు. నేనే మీస్థితిలోవుండి నాతండ్రే నామీఁద యిలా కోపపడ్డపత్తానికి, నేనతణ్ని తక్షణం తరిమి వేస్తును.

విక్ర—ఈద్రాఁగుబోతుప్రసంగముచాలించి నోరుమూసికో. నీవిందుకే వచ్చినావా! మఱి యేదైనపనిమీఁద వచ్చినావా! నా యెదుటనుండి లేచిపో. (అని గెంటి లోపలికిఁ బోవుచున్నాఁడు.)

రాము—సరిసరి! ఇది మరీబాగా వున్నది. ఈయనగారు తన కోపం తండ్రిమీఁద చూపించడానికి చేతఁగాక లోకువయినవాణ్ని నామీఁద చూపిస్తూవున్నారు. వకరు కోపం తెప్పించినప్పుడు ఆకోపం మరివకరిమీఁద చూపడం న్యాయం కాదు. అలాచెయ్యడంచేత—

[ఒకభటుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

భటు—రామా! రామా! నీయజమానుఁడు నిన్ను పిలుస్తావున్నాఁడు.

రాము—ఓరిగాడిదా! అలా అరుస్తావేమి? మెల్లిగాపిలిస్తే

నాకు వినబడ దనుకున్నావా యేమిటి? ఇది నీ నీచస్వభావం తెలియ చేస్తున్నది. వట్టినీచ—

భటు—వేగిరం. వేగిరం.

రాము—వేగిర మేమిటి! ఓరిగాడిదా! నీవుకూడా నన్నాజ్ఞాపించడమేనా? ఓపొగరుమోతుముండ—(అని భటుని గొట్టుచు వెడలిపోవుచున్నాఁడు.)

---

౨. రంగము—ఉత్తరపువీధి.

[మంథర ప్రవేశించు చున్నది.]

మంథ—సరి! నాయజమానురాలి కిప్పుడు విక్రమసేనుఁడని మరివకవరుఁడుకూడా వచ్చినాఁడు. సొమ్మునాచేతిలో పడితేనేగానివట్టి పొడిమాటలతో నే నతనికి వుత్తరాలను జేర వెయ్యను. పాపము! మాదామోదరవర్మకు తిలోదకాలు చెప్పి సాగనంపినారు. విజయపాలుఁడు యీవూళ్ళోనే వున్నాఁడని చెప్పి. అతనికి నేను చెయ్యవలసినఆఖరుపని చేసివేసినాను. తాను రాధాదేవి అని భ్రమపడుతూ వున్నతనప్రియురాలివద్దనుంచి వచ్చేవుత్తరాలు పుచ్చుకోవడానికి పురుషోత్తమదేవుఁడుగారు సరిగా వేళకు యిక్కడ వుండకుండా వుండేవారు కారు. తనప్రియురాలు చిన్నావిడ గాదు పెద్దావిడే అనీ, ఆవిడకు నలభయియేళ్ళువుంటవనీ తెలియచెప్పివేస్తేనాకు వచ్చేలాభం పోతుందని నేను యెరిగినదాన్ని అయినా, యిలా పెద్దమనిషిని మోసం చేస్తూ వుండడంచేత నామనస్సు నన్ను బాధిస్తూ వున్నది.

[పురుషోత్తమ దేవుఁడు ప్రవేశించుచున్నాఁడు]

పురు—ఓదూతీ! నాప్రాణములు నిలిపెడు దేవదూతిక యింకను రాలే దేమని నీ నిమిత్తమే నే నెదురుచూచు చున్నాను. గడియసేపటినుండి నే నీవీధియొక్క దక్షిణపుకొన నున్నాను.

మంథ—ఓయి దేవుడా! ఉత్తరపుకొనను మీ నిమిత్తం నే నెదురు చూస్తూ వున్నాను.

పురు—అందుచేత నే కాఁబోలును నీవు నాకు కనఁబడలేదు. నీ వా వైపునుండి వచ్చునప్పుడు నన్ను దాటిపోకుండ నిన్ను పిలిచి పలుకరించుటకే నేను బట్టలకొట్టులో వీధి కెదురుగా నున్న కిటికీలో కూరుచుండి మరి నిద్రపోయినాను.

మంథ—అలాగైతే మీరు నిద్రపోతూవున్న సమయంలో మీదగ్గరనుంచే నేను వెళ్ళివుంటాను.

పురు—అయి యుండును. ఇంత ప్రొద్దెక్కిన దని నిద్రలేచు వఱకును కలలోనైనను నే ననుకో లేదు. మంథరా! నీవు నాకేమియుఁ దీసికొని రాలేదా?

మంథ—యెందుకు తేకుండా వుంటాను? తెచ్చినాను. ఉత్తరం తెచ్చి నా రవికెలో పెట్టుకొన్నాను.

పురు—నీ వెప్పుడును వట్టిచేతులతో రావని నే నీవఱకే యూహచేసినాను. ఏదీ? నా ప్రాణేశ్వరి యేమివ్రాసినదో చూడనీ.

మంథ—ఇదిగో! (అని యుత్తరముతీసి యిచ్చుచున్నది.)

పురు—(చదువుచున్నాఁడు) "ఓ హృదయప్రియా! ఒకానొకప్పుడు మోహవిషయములో నాకస్మికముగా నొకవింత యనురాగము పుట్టి, సంవత్సరముల కొలఁది స్నేహము చేసినవారిలోకంటెను ఘనమైన యనుబంధమును కలిగించు చుండును. పురుషోత్తమ

దేవుఁడుగారి ప్రథమసందర్శన సమయమునందే నామనస్సులో నటువంటి గాఢానురాగ ముదయించినది"—మేలు మేలు!—"లజ్జాశీలమైన యువతి యింతకంటె నెక్కువ చెప్పరాదు. అయినను నేనింకొక్క మాట చెప్పెదను. పురుషోత్తమ దేవుఁడుగారు నేను తమ దాస్యమున కర్హురాల నని భావించిన యెడల నేను ధన్యురాల నగుదును. ఇట్లు మీ పాదసేవకురాలు—రాధ."

మంథరా! నీయజమానురాలు భాషయందు మహావిద్వాంసురాలుగా నున్నదే! ఏమి యీపాండిత్యము! ఏమి యీవాగ్ధార!

మంథ—ఆమెకువున్న లోకానుభవానికి యిదివకహాశ్చర్యం.

పురు—ఏమి! పదునేడేండ్లకే యింత లోకానుభవమా?

మంథ—నిజంగానే ఆవిడకు కావలసినంత లోకానుభవం వున్నవి. ఆవిడ యెన్నో గ్రంథాలు చదివింది.

పురు—ఈప్రకారముగా వ్రాయఁగలుగుట కామె బహు గ్రంథములు చదివి యుండవలెను.

మంథ—వ్రాతకేమి ? మీవిషయంలో ఆవిడ యేలాగు చెపుతూవుంటుందో మీరు వింటేనా?

పురు—ప్రాణ మిచ్చి యాదరించుటలో నావంటి మంచిభర్త లోకములో తనకు మఱియొకఁడు దొరకఁబోడని నీ దేవితో చెప్పుము. అయినను మనము సర్వమును యథావిధిగా చేయవలెను గనుక, ముందుగా వివాహమునకు పెద్దాబిడ సమ్మతి పొందవలెను.

మంథ—పెద్దావిడ వప్పుడల కోరడంచూస్తే, యీ వివాహం వల్ల ధనవంతులు కావడం మీకోరిక యునట్టు నే ననుకుంటాను.

పురు—ఓదూతీ! నా యుద్దేశమును నీవు చక్కగా గ్రహించినావు. నేను బీదవాఁడ నగుటచేత, నేనయోగ్యకార్యమునకు లోఁబడఁజాలను. నాకు ధనమే యక్కఱలేని పక్షమున, నీ యజమానురాలిని తద్ధనమునుగూడ నేనుదొంగతనముగా నేగ్రహించియుందును. నేను ధనికుఁడను కాకపోయినను లోభిని కాను. ఇదిగో! ఈరూపాయి పుచ్చుకొని నీవు చీర కొని కట్టుకో. పో.

(అని చేతఁ బెట్టుచున్నాఁడు.)

మంథ—మీరు మహాదొడ్డవారు. మీవంటి దాతను నేను యిదివరకు యెక్కడా చూడలేదు. మీవద్ద సొమ్ము పుచ్చుకున్నానంటే అమ్మగారు కోపపడుతా రేమో!

పురు—పయి కనకపోయినను ధనమిచ్చువారియందు స్త్రీలకు లోపల బహుసంతోషము. నీ యజమానురా లడిగినపక్షమున, ఒక రూపాయి కాదు నీకు నేను పదిరూపాయ లిచ్చితినని చెప్పు.

మంథ—ఇయ్యేనిదే అబద్ధంకూడా చెప్పనా! పాపం కాదూ! ఏమయినా యివ్వండి. ఆలాగే చెవుతాను.

పురు—మా వివాహ మయినతరువాత నిది నిజ మగునట్లే చేసెదనులే పో. (అని పోవుచున్నాఁడు.)

[రాముఁడు ప్రవేశించు చున్నాఁడు]

రాము—అమ్మా! నన్ను క్షమించవలెను.

మంథ—రామా! యిక్కడకు యెందుకు వచ్చినావు నను కున్నావు! చీర కొనుక్కోవడానికి—

రాము—నీమాయవేషాలు కొంచెం నీవు కట్టిపెట్టి నాతో నిజం చెప్పు. ఇక్కడయెవరూ లేరులే. నీవు మమ్మల్ని మోసం చేస్తూవున్నావు. నీగుట్టు నేను కనిపెట్టినాను. పురుషోత్తమదేవుడి

గారిచేతికి నీవు వుత్తరం యిస్తూవుండగా నేను కళ్ళారాచూచినాను. నీవు యిలాగు వుత్తరాలు జేరవేస్తూవున్నావుగా? యీసంగతి నేను మాప్రభువుగారితో తప్పకుండా చెపుతాను. ఆయన వూనుకుంటే యీయనపని నేను పట్టిస్తాను.

మంథ—ఓరి తెలివితక్కువవాడా! యేమనుకున్నావు? ఆహాహాహా! ఓరి బుద్ధిహీనుడా! యీవుత్తరం సుభద్రమ్మగారు వ్రాసింది రా. ఆవిడగారు యితణ్ని మోహించి వుత్తరప్రత్యుత్తరాలు జరుపుతూవున్నది.

రాము—ఆహా! యేమివింతలు వినబడుతూవున్నవీ! ఆవిడ గుమ్మంవద్దనుంచి నేను యీభైమాట్లు నడిచినాను. నాకుయీసంగతి వొక్కమాటూ తెలిసిందికాదూ!—మంచిది చిన్నావిడ యేమంటూ వున్నది? నాయజమానుడికి యేమయినాసమాచారం పంపిందా?

మంథ—ఏమి సమాచారం? ఆవిడమనస్సు తిన్నగా లేదు. ఇప్పుడు మీవిజయపాలుడికి పులిమీద పుట్రలాగు దామోదరవర్మ కంటె పెద్దపోటీదారు వచ్చినాడు. వీరసేనుడుగారు తనకొడుకుకోసం ప్రయత్నం చేస్తూవున్నారు.

రాము—ఏమీ! విక్రమసేనుడిగారికోసమా?

మంథ—అవును. ఆయనకోసమే. ఇదంతా నేను పొంచుండి విన్నాను.

రాము—ఆహాహాహా! మంథరా! ఈశుభవార్తతీసుకుని నేను వేగిరం వెళ్ళిపోవలెను.

మంథ—నీవు నవ్వితేనవ్వు. నేను చెప్పినమాటమాత్రంనిజం. నేను పరిమాణం చేసి చెపుతాను. (పోవుచు) రామా! యిందువల్ల అధైర్యపడవద్దని నీయజమానుడితో చెప్పు.

రాము—నాయజమానుడికధైర్యం యెప్పుడూ లేదు.

మంథ—యీవిషయమయి విక్రమసేనుడితో పోట్లాడ తలఁచుకోవద్దని చెప్పు.

రాము—ఆవిషయమై నీవు భయపడవలసినపని లేదు. ఆపని యెప్పుడూ జరగదు.

మంథ—ఇది నీకు నిశ్చయమేనా? విచారం మాని ధైర్యం తెచ్చుకోవలసిన దని చెప్పు.

రాము—మాకికకావలసినంత ధైర్యం.

(ఇద్దఱును వేఱు వేఱుగా వెడలిపోవు చున్నారు.)

తృతీయాంకము.

౧. రంగము—ఉత్తరపువీధి.

[విక్రమసేనుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

విక్ర—రాముఁ డిప్పుడు చెప్పినమాట నిశ్చయమే యయి యుండును. ఇదంతయు వింతగానున్నది. ఏమీ! నాతో పాఱిపోయి రాఁదలచుకొని యున్నచిన్నదానినే వివాహాము చేసికొమ్మని నన్ను మాతండ్రి బలవంతపెట్టఁ గోరుచున్నాఁడు. ఇంకను గొంతకాలము వఱకును నాకున్నసంబంధ మతఁడెఱుఁగఁగూడదు. ఇటువంటివిషయములలో నతఁడు వ్యవహారము చక్కఁబెట్టువిధము చూడఁగా మహా నిరంకుశముగా కనబడుచున్నది. కానిమ్ము. నేనుమాత్రము వెంటనే నానిశ్చయమును ద్రిప్పుకొని యతనియొద్ద నాసమ్మతిని తెలుపవలెను. అత్యాకస్మికముగా నామతి మార్చుకొన్నట్లాతని కొకవేళ తోఁచ

వచ్చును. అయినను నాహృదయముయొక్క మార్పు కృత్రిమమయినది కాదని సేనాతనికి నమ్మకము పుట్టించఁగలను. ఓహో! ఆయనే యిక్కడకు వచ్చుచున్నాఁడు! కోపముచేత ఆయనముఖ మెంత క్రూరముగాఁ గనఁబడుచున్నది! (అని ప్రక్కకుతొలఁగుచున్నాఁడు.)

[వీరసేనుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

వీర—ఈప్రాణములతో నేను వానిని క్షమింపను. ఇటువంటి యవమానము జరిగినతరువాత నేను భూమిమీఁద బ్రతుకను. ఏమన్నాను! బ్రతుకనన్నానా? కాదు వానిని బాధపెట్టుటకయి యేఁబది యేండ్లయినను నేను తప్పక బ్రతికెదను. ఇందాఁక వాఁడు చూపిన యవిధేయతవలన నామతి చెడినది. వాఁడు కేవల దురహంకారమూర్ఖస్వేచ్ఛావిహారశీలుఁడు. ఈయవినయ మంతయు వాని కెట్లు వచ్చినది? ఇది యంతయు నేను వానిని తక్కిన యందఱికొడుకుల కంటెను కూఁతులకంటెను ముందుగా కన్నందువలనను జీతము గాక సంవత్సరమున కేఁబదిరూపాయ లధికముగా పంపుచున్నందువలనను గలిగిన ఫలము. ఇఁక వానికిని నాకును ఋణము చెల్లినది. నాకు కానివాఁడు నాకొడుకే కాఁడు. ఇఁక నేను వానిముఖము చూడను. చూడను. ఎన్నఁడును చూడను.

విక్ర—(ముందునకువచ్చి తనలో) పశ్చాత్తాపపడుచున్నవాని వలె దీనముఖము పెట్టవలెను.

వీర—ఓ నిర్భాగ్యుఁడా! నా కంటఁబడక దూరముగా తొలఁగిపో.

విక్ర—అయ్యా! పశ్చాత్తప్తుఁ డయిన కుమారుఁడు మీ ముందు నిలువఁబడినాఁడు.

వీర—నాముందు బుద్ధిమాలిన క్రూరుఁడు నిలువఁబడినాఁడు.

విక్ర—నేను నిజముగా నే పశ్చాత్తప్తుఁడ నయినాను. చేసిన యపచారము నొప్పుకొని తమ చిత్తవృత్తికి లోఁబడ వలె నని నేను వచ్చినాను.

వీర—ఏమీ?

విక్ర—ఈవఱకు తమరు నావిషయమునఁ గనఁబఱిచిన మంచితనమును దయను పుత్రవాత్సల్యమును చింతించి తలపోసి యాలోచించుకొని బుద్ధి తెచ్చుకొను చున్నాను.

వీర—మంచిది. తరువాత?

విక్ర—అంతేకాక తమరు సెలవిచ్చిన సుతధర్మమునుగూర్చియు విధేయతను గూర్చియు పితృస్వాతంత్ర్యమును గూర్చియుఁ గూడ పదింబదిగ నాలోచించుకొని కర్తవ్యవిచారము చేసికొను చున్నాను.

వీర—ఓరి నెట్టికుట్టవాఁడా! ఆపయిని?

విక్ర—నా యాలోచనయొక్క పర్యవసానము తమసంతుష్టినిమిత్తమయి నాయిష్టములను మఱచి సమస్తవిషయములలోను తమకు భృత్యుఁడనయి నడుచుకోవలెనని నిశ్చయము చేసికొన్నాను.

వీర—ఇప్పుడు నీవు కొంచెము తెలివిగలమాట లాడుచున్నావు. నీవాడిన మాటలలో తెలివిమాలిన మాట యేదియు లేదు. ఇంతకంటె తెలవిగల మాటలు నీ వింతకుముం దెప్పుడును నాముందు పలికి యుండలేదు. నీ విప్పుడు మరల నా కొడుకు విక్రముఁడ వయినావు.

విక్ర—తమ యనుగ్రహమునకు పాత్రుఁడ నగుటచేత నేను కృతార్థుఁడ నయినాను.

వీర—నాప్రాణమా! నాముద్దుకుఱ్ఱా! నిజముగా ఆచిన్నది యెవరో నీ కిప్పుడు చెప్పెదను. నీమూర్ఖత్వమును కోపమును జూచి నే నప్పుడు నీతోఁ జెప్పలేదు. విని నీవిప్పు డద్భుతప్రమోదముల పాలు కావచ్చును. కళావతివిషయములో నీయభిప్రాయ మేమి?

విక్రి—ఎక్కడి కళావతి? భీమవరములో నుండెడుకళావతి కాదా?

వీర—భీమవరమా! ఎక్కడిభీమవరము? కాదు. సుభద్రమ్మను, ఆమె మేనకోడలు కళావతిని నీ వెన్నఁడును జూడనే లేదా? నీవుపనిలోఁ బ్రవేశించి వెళ్ళిన తరువాత వారు మనయింటి కొక పర్యాయము వచ్చినారు.

విక్ర—సుభద్రమ్మ! కళావతి! ఈపేరు లెప్పుడును నేను విన్నట్లేజ్ఞప్తి లేదు. ఇప్పుడు కొంచెము నాకు స్మరణకు వచ్చుచున్నది. అవునవును. ఆచిన్నదానిది మెల్లకన్ను. అవునా? కొంచెము రాగి వెండ్రుకలు.

వీర—మెల్లకన్నా రాగివెండ్రుకలా? ఎంతమాత్రమునుగావు.

విక్ర—అట్లయినపక్షమున నేనే మఱచిపోయి యుందును. ఆచిన్నది నేను చూచినచిన్నది కాదు.

వీర—విక్రమా! ఆచిన్నదానిసౌదర్య మేమని చెప్పను! ఆయువతీమణి రెండవ రతీదేవి. పదునాలుసంవత్సరములు దాఁటి పూర్ణ చంద్రబింబమువలె కళావతి యిప్పుడు పదునేడవయేట నిండు యౌవనవతియై యున్నది.

విక్ర—ఆవిషయమయి నా కంత చింతలేదు. మీమనస్సును సంతోషపెట్టుట యొక్కటియే నాకు కావలెను గాని నాకితరములో దేనితోను పని లేదు.

వీర—విక్రమా! అది సత్యమేకాని, ఆచిన్నదిమాత్రము కేవల సమ్మోహనమంత్రాధి దేవతసుమా! ఆమె కన్నులలోలక్ష్మి కాపురమున్నది. ఆమెకటాక్ష ప్రసారము కొంచెము తగిలెనా, తమజపతపములు చాలించి మానికాంతు లయినను దాసు లయి పాదాక్రాంతులు కావలసినదే. ఆహా! ఆ నవ్వుమొగము! ఏమి యాచెక్కుటద్దముల ధాళధళ్యము!

విక్ర—(తనలో) ఇది సత్యము. వృద్ధుఁడయినను, ఇతఁడు సరిగా వర్ణించినాఁడు,

వీర—విక్రమా! ఏమి యామె మల్లెమొగ్గలఁబోలు పలువరుస!

విక్ర—వర్ణనాంశము చాలును. వారిలో నేనిప్పుడు వరింపవలసినది మేనత్తనా? మేనకోడలినా?

వీర—ఓరి నిర్భాగ్యుఁడా! నీమనస్సురాయివలె నున్న దేమి? నాచిన్నతనములో నీవయస్సున నా కిటువంటివర్ణన చెవులఁ బడిన పక్షమున, ఆకాశబాణమువలె పై కెగిరి గంతులు వేసెడి వాఁడను. నీ విప్పుడు కదలనే కదలకున్నావు. మేనత్తనా? ఓరిబుద్ధిహీనుఁడా! నీ తల్లిని నేను లేవఁదీసికొని వచ్చి వరించినసంగతి నీవు విన్నావా లేదా? నాకు చక్రవర్తిత్వము వచ్చినను, నేనయినపక్షమున వయసు జాఱినదానివాసన నాకు సోఁకనీయను.

విక్ర—మీ తండ్రిగారిని సంతోషపెట్టుట కయినను, ఆపని చేయరా?

వీర—మాతండ్రిగారిని సంతోష పెట్టుటకా? లోకములో నెవరిని సంతోషపెట్టుటకును నేను చేయను—ఏమన్నావు? మా తండ్రిగారినా! అవునవును. మఱచి పోయినాను. నాతండ్రిగారు

చెప్పినపక్షమున—అది వేరేసంగతి—విక్రమా! ఆయన నావలె కొడుకునకు చన విచ్చెడివాఁడు కాఁడుసుమా!

విక్ర—కాఁడు నిశ్చయమే.

వీర—విక్రమా! నీభార్య చక్కనిదైనందుకు నీకు విచారము లేదుగదా!

విక్ర—నేనాసంగతి యీవఱకే చెప్పినాను. ఈవిషయములో నాకు కావలసినదెల్లను మిమ్ముసంతోషపెట్టుట యొక్కటియే. మీ కిష్టమయినయెడల చక్కనిదన్న హేతువుచేత నే నేచిన్నదానిని నిరాకరింపను. ఇందాఁక మీరు కంతులని, కాయక న్నని నావధువునం దిటువంటివే మఱికొన్ని శుభలక్షణములనుకూడ వర్ణించియున్నారు. లోకసామాన్యముగా మీ రభివర్ణించినయవగుణములు లేనికన్యను వరించుటయే నాయభిమతమయినను, తమచిత్తానుసారముగా కన్నులందుకాయలుమాత్రమేకాక పువ్వులున్నచిన్నదానిని వరింపుమన్నను నేను వరింపవలసినవాఁడనే.

వీర—ఏమి యీపితృభక్తి! నీ నీతివాక్యము లింతటితో చాలించు. ఆచిన్నదానిసౌందర్యము తలఁచుకొఁగానే యిప్పుడు నాకే యాచిన్నదానిని వరింపవలె నన్నబుద్ధి పుట్టుచున్నది.

విక్ర—తమయిష్టానుసారముగానే జరగవచ్చును. కళావతిని మీరే వరింపఁ దలచుకొన్నయెడల, అప్పుడు నేనామెమేనత్తను వరించుట తమయభిమత మయి యుండవచ్చును. లేదా మీరింతలో మీయభిప్రాయము మార్చుకొని పెద్దామెనే చేపట్టఁ దలఁచుకొన్నయెడల, అప్పుడు చిన్నామెనే నేను వరించుట తమయిష్టము కావచ్చును. మేనత్తయైనను, మేనకోడ లయినను, నాకెవ్వరైనను భేదము లేదు. తమయిష్టమేదో యదే జరగవచ్చును.

వీర—ఓరిదొంగా! నీవిప్పు డిచ్చకముల కయి మాయమాట లాడుచున్నావు. నీవిప్పు డాడెడుమాటలు మనఃపూర్వకము లైనవి కావు. నీమొగము చూడఁగానే నీవబద్ధము లాడుచున్నట్లు నాకు పొడకట్టు చున్నది. నీదొంగవేషములు నావద్ద పనికిరావు. విక్రమా! నిజ మొప్పుకో.

విక్రి—నా పితృభక్తియు విధేయతను మీా మనస్సునకు మఱియొకవిధముగా తోఁచినందుకు నాకు విచారము—

వీర—చాలు. నీ పితృభక్తియు గిక్తియు తుంగలో నూరఁ ద్రొక్కు. నీమాయమాటలు కట్టిపెట్టి నీవునా వెంటరా. సుభద్ర మ్మపేర చీటి వ్రాసి నీచేతికిచ్చెదను. నీవిప్పుడేపోయి' యాచిన్న దానిని చూడ వచ్చును. ఆ భూలోకదేవతయొక్క దివ్యసుందర విగ్రహమును జూచినప్పుడు నీకన్నులు మిఱుమిట్లుగొనక మానవు. ఆమెముఖసందర్శనముచేత వలపువెఱ్ఱి తల కెక్కి యద్భుతప్రమో దములతో మోహపరవశుఁడ వయి నీవు నావద్దకు పరుగెత్తుకొని రాకపోయిన పక్షమున, న న్నీపేరునఁ బిలువఁబోకు. అప్పుడును నీ వుదాసీనతనే కనఁబఱిచినయెడల నీకుమాని వేసి యాచిన్నదానిని నేనే పెండ్లి చేసికొ నెదను. (అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు.)

---

౨. రంగము—చారుమతియొక్క గది.

[దర్పసారుఁ డొంటిగా ప్రవేశించుచున్నాఁడు.]

దర్ప—చారుమతి యిప్పుడే వచ్చునని చెప్పినారు. ఆమె యింకను రాలేదు. నేను స్వస్థచిత్తుఁడనయి యాలోచించుకొన్నప్పుడు

చంచలమైన నాయసంతుష్టస్వభావము నాకే నీచముగాఁ గనఁబడు
చున్నది. అయినను నా కీయొక్కదానిమీఁదఁ దక్క మఱిదేనిమీఁ
దను ధ్యానము పాఱకున్నది. ప్రాణాధికురాలయిన యామెయే
నాకు లోకముగా నున్నది. నే నెందుచేతనో నిష్కారణముగా కొఱ
కొఱలాడుచు నున్మత్తునివలె చంచలచిత్తుఁడనై యున్నాను. నా
తప్పిదము నాకు స్పష్టముగా కనబడుచున్నను దిద్దుకొనుటకు శక్తు
డను గాకున్నాను. మే మిద్దఱమును సమావేశ మయినప్పు డామె
కన్నులయం దెట్టి యవ్యాజప్రేమమును అకృత్రిమానందమును గనఁ
బడినవి! ఆమె చూపిన యాదరము మనస్సు నెంత కరఁగించినది!
మూఢు మొగమును బెట్టుకొని యామెను నిందింపవలె నన్న నిశ్చయ
ముతోనే నేను వచ్చినను, ఆమెప్రసన్నముఖమును జూడఁగానే
యట్లగపడుటకు నాకే సిగ్గు వేసినది. వీరసేనుఁడుగా రెదుటనుండుట
చేత నేననఁదలఁచుకొని వచ్చినమాటలనుసహిత మనలేకపోయినాను.
అయినను నన్నెడఁబాసి యున్నప్పుడామె నే ననుకొన్నంత సంతో
షముగా లే దన్నవార్తను తెలిసికొని నామనస్సును తృప్తిపఱుచుకో
వలెను. అదిగో! ఆమె వచ్చుచున్నట్లున్నది. అవును! దర్పసారుఁడు
తనరాకకు వేచి నిమిషములులెక్కపెట్టుచుఁ గూరుచున్నప్పు డెంత
మందగమనముతో వచ్చుచున్నదో!

[చారుమతి ప్రవేశించుచున్నది.]

చారు—ఇంతశీఘ్రముగా మీకు మరల వత్తురని నే నను
కోలేదు.

దర్ప—ఓ చారుమతీ! మనప్రథమసమావేశసమయమునందే
యథేచ్ఛముగా మాటాడుకొనుటకు ప్రతిబంధకముగా పానకముతో

పుడకవలె మఱియొకరు నిలిచియున్నప్పుడు, నేనొక్కసందర్శనముతో తృప్తి నొంది యుండగలుగుదునా?

చారు—ఓ దర్పసారా! నీ విప్పుడు చూపుచున్నయనుగ్రహము నన్నపారసంతోషసాగరమునందుఁ దేల్చుచున్నప్పుడు, ప్రథమసందర్శనసమయమునందు నీవు చూపితి వనుకొన్నయనాదరమును గూర్చి నేను ప్రస్తావించుట యుచితము కాదు.

దర్ప—చారుమతీ! అది కేవలభ్రమ! నీ వప్పుడు మతిభ్రమపడినావు. నీవటువంటి యారోగ్యదశలో నుండుటచేత నేను పరమానందభరితుఁడ నయినాను. నే ననాదరముచూపుట కేదియు కారణము లేదు.

చారు—అయినను నీ వేదో మనస్సులో విచారము పెట్టుకొన్నట్టు నాకు స్ఫురించినది. అది యేదో నీవు నాయొద్ద దాఁచఁగూడదు.

దర్ప—ఇఁక నామనస్సులో నున్నది నీకు చెప్పివేసెదను. నీ క్షేమవార్తలు మొదలయినవి మీపొరిగింటివాఁడైన దామోదరవర్మ వలన విన్నప్పుడు, మీయూరిలో నున్నప్పటి నీయుత్సాహమును గూర్చియు నీసంతోషమునుగూర్చియు నీమాటలనుగూర్చియు నీపాటలనుగూర్చియు నతఁడు వర్ణించినదానినిబట్టి నామనస్సునకు కొంచెమాయాసము తోఁచినది. నీవు నన్నెడఁబాసి యున్నప్పుడు నేను నవ్వుచు త్రుళ్ళుచు వేడుక లనుభవించుట ద్రోహముగాఁ దలఁచెడు స్వభావము గలవాఁడ నగుటచేత నాకట్లు తోఁచినది. కాముకీకాముకులొండొరుల నెడఁబాయునప్పుడు కన్నుకొలుకులనుండి పుట్టి చెక్కుల జాలువాఱు కన్నీటికాలువ లొకపట్టున నింకిపోవునవి కాక స్థిరముగా నుండునవి యైనందున, వారు పునస్సమావేశముచేత వానిని తుడిచి

వేయఁగలుగువఱకును వారి మొగములయందు మందహాసాంకురము లుదయించవుగదా?

చారు—ఇటువంటి యల్పాంశములను పెద్దచేసి నాప్రాణేశ్వరుఁడు దర్పసారుఁడు నన్ను బాధించుచుండుట యెల్లకాలమునువకానకయేయుండునా? చిరకాలపరీక్షితమైన మనోవల్లభయొక్క దృఢానురాగమునకంటెను నీహృదయములో మృగప్రాయుఁడైనయాకుత్సిత పురుషునియొక్క వ్యర్థాలాపము లేయెక్కువ గౌరవనీయము లయినవా?

దర్ప—లేదు లేదు. చారుమతీ! నాకాతనిమాటల యం దెంత మాత్రమును గౌరవము లేదు. నీవట్లుండినందుకు నాకు సంతోషము గానే యున్నది. అయినను నీవప్పు డతఁడు చెప్పినంతహృదయోత్సాహముతో పాటలు పాడలేదని చెప్పితివేని నేను తృప్తి నొందెదను. ఆ వినోదసమయమునందు నీవునీదర్పసారుని మఱచిపోలేదనిమాత్రము చెప్పు. చాలును.

చారు—నీవు దూరముగా నున్నప్పుడు నే నెప్పుఁడునుసంతోషముపొందఁజాలను. దర్పసారునికి నాయెడఁగల యనురాగవిషయమయి నాకణుమాత్రమును సంశయము లేనందున, నేను పయికి నవ్వు మొగముతో నుల్లాసముగా నున్నట్లు కనఁబడుదును. నే నప్పుడయిన విచారగ్రస్తురాల నయి యున్నట్లుకనఁబడినపక్షమున, అసూయాపరులు తమలోసంతోషించి తన్నువిడిచి దుఃఖములపాలు చేసెడి గుణవంతునినమ్మి యీమె తనహృదయము నాతనివశము చేసె నని నావిషయమయి చెప్పుకొనునట్లు చేయుటకొఱకే కాని వేఱు కారణము చేతఁగాదు. దర్పసారా! నిన్నుదూషించుట కయి చెప్పను. నామాట నమ్ము. ఎవరియొక్కయనాదరమువలన నాకు మనస్తాపము కలిగినదో నాచెలికత్తెలు గ్రహించి పోదురేమో యని నేను నిశ్చయముగా

లోపల దుఃఖ మున్నప్పుడుసహితము పయికి సంతోషము నే యభిన
యించు చుండును.

దర్ప—నీ వెల్లప్పుడును నా యెదుట నవ్యాజప్రేమ గలభాగ్య
దేవత వే. బద్ధానురాగమయిననీవిషయమున సంశయపడినందున నేనే
పశుప్రాయుఁడను.

చారు—నీవలనఁ దగినంత కారణము కలుఁగని దే నాహృదయ
ములో నీమీఁద గలయనురాగము లేశ మయినను తగ్గుట తటస్థిం
చినపక్షమున, లోకములో నావంటిపరిహాసపాత్రురాలును కృతఘ్న
రాలును స్త్రీజాతిలో మఱియొక తె యుండఁబోదు.

దర్ప—ఓ చారుమతీ! నీవటువంటిమాట యెన్నఁడు ననఁ
బోకు; కృతఘ్నురా లన్నమాట నామనస్సునకు నొప్పి కలిగించు
చున్నది. నీకృతజ్ఞతకు యోగ్యుఁడను గావలసినంత యుపకారము నీకు
నే నేదియుఁ జేసి యుండలేదు. ఆసంగతి చక్కఁగా పరిశీలించినచో నీ
హృదయమునకే తేటపడవచ్చును. అతికృతజ్ఞతాబుద్ధి గలదానవయిన
నీవు నీసౌజన్యాతిశయమునుబట్టి నీహృదయమునందుఁగల నామీఁది
ప్రేమకు కృతజ్ఞతయొక కారణమని భ్రమపడుచున్నావు కాఁబోలును!

చారు—కృతజ్ఞతనుబట్టియే కాకపోయినపక్షమున నీయందలి
యేగుణాతిశయమునుబట్టి నీమీఁద నా కనురాగము కలుగవలసినది?

దర్ప—ఏగుణాతిశయమునుబట్టియుఁ గాదు. బుద్ధివిశేషమును
బట్టిగాని నీతివిశేషమునుబట్టిగాని నన్ను నీవు ప్రేమించుట నాకుగౌర
వావహము. ఇఁక శరీరసౌందర్య మందువేమో, నాశరీరములోని
యేయంగసౌష్ఠవమునుబట్టియు నీప్రేమలో లేశభాగమును నామీఁద
నిలువఁగూడదని నీకుఁ జూపుటకయి నేనంగవైకల్యము చేసికొని

కురూపి నగుదునా యని నామనస్సులో నేను పలుమాఱు కోరుకొనుచుందును.

చారు—ఈశ్వరుఁ డెవ్వరికైన నొక్క దేహసౌందర్యమును మాత్రము ప్రసాదించినపక్షమున, తన విషయమున పరిహాసాస్పదమయినపొరపాటు జరిగిన దని యట్టివాఁడు చింతిల్లవలసి యున్నది. అట్టి వ్యర్థ మయినశరీరసౌందర్యమునందు నీకంటెఁ గొంచె మధికు లని చెప్పవచ్చినవారిని నేను గొందఱిని జూచి యున్నా ననుకొనెదను. అయినను వారట్టివా రగుదురా కారా యనుప్రశ్నమాత్రము నా హృదయ మెప్పుడును నాకన్నుల నడిగి యుండ లేదు.

దర్పం—ఓ చారుమతీ! ఈవిషయములో నీచర్య నా మనసునకు సరిపడి యుండ లేదు. పురుషులయందు శరీరసౌందర్యమన్న నాకు పరమ ద్వేషము. నే ననుకొన్నంత యనురాగము నీకు నామీఁద నుండినపక్షమున, నే నష్టావక్రునివంటి కురూపి నయినను నీవు వేఱొకపురుషుని రూపవంతునిగా భావించియుండవు.

చారు—నీవు నన్ననాదరము చేయవలె నని నిశ్చయించుకొని వచ్చినట్లు కనఁబడుచున్నది. శోచనీయులయిన మాతండ్రిగారు మనల నిద్దఱిని బద్ధులనుజేసి పోయిన యాజ్ఞాబలము చూచుకొని మగలు తమ ప్రియురాండ్రయెడలఁ జూపవలసిన స్వాతంత్ర్యముల నతిక్రమించి నీవు నన్నట్లు చులకన చేయుచున్నావు.

దర్ప—చారుమతీ! నీవిప్పుడు నాసందేహము బలపడి వృద్ధియగుటకుఁ దగినట్లుగా మాటాడుచున్నావు. నే నధికస్వతంత్రుఁడ నయినపక్షమున—అక్కఱలేదు. ఎప్పుడును తదాజ్ఞాబద్ధుఁడనయి యుండుటయే నాకు పరమసమ్మతము. అయినను—ఒక వేళ నీ తండ్రిగారి యాజ్ఞయందు నీకుఁగల యధికగౌరవమే నీ యిచ్ఛ నిట్లు

నిర్బంధించి యున్నదికాఁబోలును! అది లేకపోయినయెడల నీమనస్సు నాకంటె నర్హతరుఁ డయినవానిని గోరియుండును. నీ వాంఛలయందును వాగ్దానములయందును నీ కట్టి నిర్బంధమే యుండియుండనిపక్షమున, నే నెల్లప్పుడును నీ స్థిరమయిన ప్రేమ కాస్పదుఁడనై యుందునన్న యంశమునందు నే నెట్లు నిశ్చయము కలిగియుండఁ గలను?

చారు—అట్లయినపక్షమున నన్ను నేఁటినుండియు శోధించి చూడు. వెనుకటి దంతయు మఱచిపోయి యేనిర్బంధమును లేక మనము క్రొత్తవారివలె నగుదుము. నా హృదయము మాత్రము తా నెక్కువ స్వాతంత్ర్యమును పొందినట్లు భావింపకున్నది.

దర్ప—అదిగో! అదిగో! చారుమతీ! ఇంత వేగిరపాటు గూడదు. నీవు నీ నిర్బంధమును వదల్చుకొనుట కెంతతొందర పడుచున్నావు! నీకు నాపయిని గల యనురాగ మవ్యాజ మయి దృఢమయిన దయినయెడల, నే నొకవేళఁ గోరినను నీమనస్సునుండి యది తన పట్టువిడిచి తొలఁగదు.

చారు—ఓదర్పసారా! నీవు నా మనస్సునకు దుర్భర వేదనను కలిగించుచున్నావు. నే నది సహింపలేను.

దర్ప—నీమనస్సునకు నొప్పి కలిగించుట నా యుద్దేశము కాదు. నీ మీఁద నాకింత ప్రేమ లేకుండినపక్షమున, నే నెప్పుడు నణుమాత్రమును నీ కాయాసము కలుగఁ జేసి యుండును. నే నొక్క మాట చెప్పెదను విను. నాకు కలిగిన సందేహముల కెల్లను మూలకారణమిది—స్త్రీ లెప్పుడును తమ ప్రేమకుఁగల కారణములను చక్కగా యోచించుకొని వానివాని గుణగౌరవమును నిర్ణయించుకొన నలవాటుపడినవారు కారు! పితాజ్ఞవలనఁగాని కృతజ్ఞతవలనఁగాని లాభదృష్టివలనఁ గాని కలిగిన దాక్షిణ్యమును కొన్ని సమయ

ములయందు నిర్మల మయిన హృదయానురాగమును గా భ్రమిం తురు. ఆత్మస్తుతికూడదు. అయినను చెప్పవలసినది చెప్పకోవలెను. వయస్సునుబట్టి కాని రూపమును బట్టికాని గుణములను బట్టికాని యెవ్వరును నన్నా దరము చేయువలసిన యవస్థలో నేను లేను; నా ధనసంపదనుబట్టి చూచిననన్ను వరించువారు విచారపడవలసిన స్థితిలో నేనులేను. ఇటువంటి లక్షణములు కలవారిమీఁద వలపు ప్రసరించి నప్పుడది యేకారణమునుబట్టి పుట్టె నాయని బుద్ధిమంతులు సందేహపడుట యసహజముకాదు.

చారు—ఈ యెత్తిపొడుపుమాట లేల యనుచున్నావో నేను నిశ్చయముగాఁ జెప్పఁ జాలను. అయినను నన్నవమాన పఱు చుటకయి యీపుల్లకట్టుమాటలు నీవనుచున్నట్లు నాకు కనఁబడు చున్నందున. నన్నవమాన పఱచినందున కయి ముందు నీవు పశ్చా త్తాపపడుట కవకాశము కలుగకుండఁ జేసెదను. ఇట్టి యనుమానము కలిగించుటకు నీకు నే నేమియు దోషము చేసి యుండలేదు.

(అని కన్నీరు పెట్టుకొని లేచి పోవుచున్నది.)

దర్ప—ఓ చారుమతీ! కన్నీరు పెట్టుకొనుచు నన్ను విడిచి పోకు. క్షణకాల మిందు నిలుపు. అదిగో తలుపుకూడ లోపల వేసికొన్నది! ఓ చారుమతీ! నాప్రాణమా! క్షణకాలముమాత్రమే! లోపల పెద్దపెట్టున నేడ్చుచున్నది! నాప్రాణములు నిలువకున్నవి. ఆమెను నిష్కారణముగా దుఃఖపెట్టినాను. నేను పశుప్రాయుఁడను. తాళు. ఆమె వచ్చుచున్నట్టున్నది. స్త్రీలకు చిత్తస్థైర్య ముండదు. గొన్ని మంచిమాటలు చెప్పఁగానే వా రుబ్బి తబ్బి బ్బగుదురు. ఏదీ! ఆమె రానేలేదు. ఓప్రాణేశ్వరీ! చారుమతీ! ఒక్కసారి వచ్చి నన్ను క్షమించితి నని యొక్క మాటుమాత్రము చెప్పిపో పగ

సాధించుట కిది సమయముకాదు. అదిగో! వచ్చుచున్నట్టున్నది. నన్ను కొంచెము సేపూరక భ్రమపెట్టుట కయి యీ మిషమీఁద లోపలికి పోయినది. నేను మనస్తాపపడఁగా చూచి క్షణకాల మయి నను సహించి యుండఁగలుగునా? నే నామెను లక్ష్యము చేయనట్టు నటింపవలెను. (అని యేదో గీతము పాడుచున్నాఁడు) ఏమి! యింకను రానేలేదు. ఆమె రాఁ దలఁచుకోనేలేదు కాఁబోలును! ఇది కేవల మూర్ఖతగాని చిత్తస్థైర్యముకాదు. అయినను నాకిట్టి ప్రాయశ్చిత్తము కలుగవలసినదే! అంతకాల మెడఁబాసి యున్న తరువాత స్వల్పాంశమునుబట్టి కలహము పెట్టుకొన్న నే నీ వ్యథకర్హుఁడనే. నేను వట్టిపశుతుల్యుఁడను మృగప్రాయుఁడను. ఆమె మొగము చూచుటకు నాకిప్పుడు సిగ్గగుచున్నది. ఆమెకోపముకొంత శాంతి పొందువఱకును తాళి వేచియుండెదను. ఈప్రకారముగా నే నామెను మఱియొకహారి యవివేకి నయి బాధపెట్టితినా, శాంత స్వభావురా లయిన నా ప్రాణవల్లభను నేను బోఁగొట్టుకొని సదా పండ్లు పటపటఁ గొఱుకుచుండెడు కోపశీలురాలి నెవ్వతనో చెట్టఁబట్టి నా యవివేకమునుగూర్చి రాత్రి నాలుగుజాములును పగలు రెండు జాములును పరితపింప వలసినవాఁడ నగుదును.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

---

3 రంగము—సుభద్రమ్మగారి యిల్లు.

[చేత నొకయుత్తరము పట్టుకొని సుభద్రమ్మయు, విక్రమసేనుఁడును ప్రవేశించుచున్నారు.]

సుభ—విక్రమసేనా! నేను నిన్ను గౌరవించుటకు నీవు వీర

నేనుని పుత్రుండ నగుట యొక్కటియే చాలును. ఇప్పుడు నేను నీతో మాటాడినదానినిబట్టి నీగుణగౌరవము విషయమయి యీవఱకువిన్న దానికిని నే నిప్పుడు ప్రత్యక్షముగాఁ జూచినదానికిని సరిపోయినది.

విక్ర—కళావతిని నేనీవఱ కెన్నఁడును జూడనివాఁడ నైనను నే నాచిన్నదానిని వివాహ మాడఁగోరుటకుఁ గలముఖ్యకారణ మంతయు నీ తెలివితేటలను గుణసంపదను విద్యావివేకములను సర్వజనులును పొగడుచుండుట విని సుభద్రమ్మగారితోడి బంధుత్వగౌరవ మాశపడుటయే కాని మఱియొకటి కాదు.

సుభ—నీకు నాయెడఁగల యాదరాతిశయమునకు సంతోష మగుచున్నది. దయచేసికూర్చుండుము. (ఇద్దఱును గూరుచున్నారు.) నీవంటిబుద్ధిమంతు లెవ్వరో యొకానొకరుగాని యీకాలమునందు సామాన్యముగా స్త్రీలయందుండెడు వినయ వివేకాదులగు గుణసంపదను కనిపెట్టఁగలపురుషులే లేరు. అల్పమయినను స్త్రీలకు విద్య యెంత యలంకారమో యెవ్వరును ఆలోచింపనే యాలోచింపరు. మనుష్యులు జ్ఞానహీను లగుటచేత నొక్కపనికిమాలినశరీరసౌందర్య పుష్పమును దక్క మఱి దేనిని జూడరు.

విక్ర—నీవు చెప్పిన దంతయు పరమసత్యము. అయినను నీ విప్పుడు చెప్పినవిషయములో స్త్రీలదోషముకూడ కొంతవఱకున్నది. మేము పూవువంటి తనుచక్కఁదనముచుగాంచి యచ్చుతపడుచుండుట చూచి, స్త్రీలుకూడ తమకు విద్యావివేకము లనావశ్యకము లని తలఁచుచున్నారు. అందుచేత వా రారామలతలవలె కాలమహిమచేత తామాపుష్పమును గోలుపోవువఱకును ఫలములను బొందకున్నారు. చూతలతవలెను సుభద్రమ్మవలెను నేకకాలమం దెవ్వరో కొందఱు

మాత్రమే పుష్పఫలసంపదను రెంటిని బొంది యీలోకములో ప్రకాశించు చుండురు.

సుభ—అబ్బాయీ! నీవు నీసుగుణసంపత్తిచేత నన్నానంద పరవశురాలిని జేయుచున్నావు. (తనలో) పరగుణగ్రహణపారీణత యంతయు నితనిసొమ్ముగా నున్నది! (ప్రకాశముగా) విక్రమసేనా! ఈ తెలివిమాలినది తనమనస్సు నేలాగుననో పొంచులమూరి తిరుగుఁబోతు బిచ్చగాఁడయినవిజయపాలుఁడనువానిమీఁద నిలిపి యున్న సంగతి నీకీవఱకు తెలిసి యుండకపోదు. వాని మొగ మెట్లుండునో మే మీవఱ కెవ్వరమును జూడలేదు; వానివిషయ మయి యెవ్వరికిని ఏమియు తెలియదు.

విక్ర—ఆ నవ్వులాట వ్యవహారమునుగూర్చి నేను కొంచె మెఱుఁగుదును. ఆవిషయమునుగూర్చి నాకామెమీఁద మనస్సులో నసూయ యెంతమాత్రమును లేదు.

సుభ—నీవు మిక్కిలి దొడ్డవాఁడవు; శాంతస్వభావుఁడవు. ఆవ్యవహారమును బయటికి లాగినది మొదలుకొని నాచేతనయినపని యంతయుఁ జేసినాను. ఎప్పుడును వారిని పేరైన నుడలపెట్టవలదని నేను చిరకాలముక్రిందటనే దానికి గట్టియుత్తరువుచేసినాను. అటుతరువాత వీరసేనుఁడుగారు చెప్పినవిషయము దానికి చక్కగా బోధపఱిచి చెప్పినాను. నేనెన్నివిధములఁ జెప్పినను నాకృషి యంతయు బూడిదలో పోసిన పన్నీ రయిపోయినది. నాబుద్ధికిచూడఁగా నానోటినుండివచ్చిన ప్రతివిషయమును నిరాకరించవలెనని యదినిశ్చయము చేసికొన్నట్లు తోఁచుచున్నది.

విక్ర—అందువలన నీమనస్సున కెంతో నొప్పిగలిగియుండును.

సుభ—నొప్పి గిప్పి నేను జెప్పలేను. దానిచేష్టలు చూడఁగా

నామనస్సు నుండుకొని పోవుచున్నది. అది వానితో నుత్తరప్రత్యుత్తరములు జరుపుటయైనను నేఁటివఱకు మానలేదు. నీవు చూడలేదు గాని, వాఁడు వ్రాసినయుత్తరము మఱియొకటి నేను నేఁటియుదయమునను పట్టుకొన్నాను. అది నాఅవికలో నుండవలెను.

విక్ర—(తనలో) ఓయి దేవుఁడా! అది నాకడపటియుత్తరము కాఁబోలును!

సుభ—ఇదిగో! ఉత్తర మున్నది.

విక్ర—(తనలో) ఇది నిశ్చయముగా నాయుత్తరమే. ఓసి మంథరా! ఎంత మోసము చేసినావే!

సుభ—ఈవ్రాఁత నీవు గుఱుతు పట్టగలవేమో చూడు.

(అని యుత్తరము చేతి కిచ్చుచున్నది.)

విక్ర—ఈవ్రాఁత నేనీవఱకు చూచినట్టేయున్నది. ఇది నేను చూచినదే. అవునవును—

సుభ—కానిమ్ము. అది కొంచెము చదివి చూడు.

విక్ర—(చదువుచున్నాఁడు.) "నాభాగ్యదేవతా! నా ప్రాణమా! కళావతీ!"–ఈమృదువచనములు నిశ్చయముగాగాఢానురాగమును తేటపఱుచుచున్నవి.

సుభ—మృదువచనములా! వట్టిపనికిమాలినమాటలు.

విక్ర—(చదువుచున్నాఁడు.) "నీవు వ్రాసినవింతసంగతుల వలన నామనస్సున కెంతో భయమగుచున్నది. అందులోను ముఖ్యముగా నానూతనప్రతిపక్షి."—

సుభ—నూతనప్రతిపక్షియనఁగా నీవని వానియభిప్రాయము.

విక్ర—(చదువుచున్నాఁడు.) "విద్యావినయసంపన్నుఁడని మాననీయుఁడయినరసికవతంసుఁడని యెల్లవారును చెప్పుకొను

చుండుటచేత నాభయము మఱింత యెక్కువగుచున్నది.''—ఇం దేదియు నింద లేదు.

సుభ—ఇట్లు వ్రాయుటకు వానికి లోపల నేదో యుద్దేశ మున్నది.

విక్ర—ఉన్నది. ఆవిషయమయి నేను నిశ్చయముగాఁ జెప్పఁ గలను.

సుభ—ఉన్ననింద యంతయు ముందున్నది విందువుగాని చదువు.

విక్ర—(చదువుచున్నాఁడు.) ''నీకు సంరక్షకురాలుగా నున్న యాముసలిపిశాచమును—'' అతఁ డిది యెవరినిగూర్చి యని యుండును ?

సుభ—నన్నుఁగూర్చి. వానియభిప్రాయము నేననియే. వాని విషయమై యిప్పుడు నీయభిప్రాయ మేమి? ఇఁకఁ గొంచెము చదువు. ముందు స్వరము తెలియవచ్చును.

విక్ర—కేవలబుద్ధిహీనుఁడు. (చదువుచున్నాఁడు.) ''మనము తప్పించుకొనుట కష్టమేయయినను, నాసామర్థ్యవిశేషముచేత దాని జాగరూకత యంతయు విఫల మగునట్లు చేసెదను. ఆముసలిది తన వాడఁబాఱిన చెక్కులకు మెఱుఁగు వచ్చుట కయి వర్ణము వేసికొని తాను పండితురాలని తోఁచుటకయి సంభాషణలో పెద్దపెద్దమాట లుపయోగించెడు వ్యర్థదంభము కలదని విన్నాను—'',

సుభ—అదిగో నామాటల నాక్షేపించుచున్నాఁడు. నీ వేమనుకొన్నావు? అది నాపాండిత్యప్రకర్షముమీఁద దోషారోపణ. అటువంటి మృగప్రాయుఁడు లోకములో మఱియొకఁ డుండఁబోఁడు.

నేను నాసంభాషణవిషయములో పడునంతజాగరూకత మఱి దేని
లోను పడను. వానివ్రాఁత చూచినావా?

విక్రి—ఈవిషయములో నతఁ డెంతటిశిక్ష కయిననర్హుఁడే. ఏదీ యేమి వ్రాసినాఁడో చూతము. (చదువుచున్నాఁడు.) "ఆముసలిది తనవాడఁబాఱిన చెక్కులకు—"

సుభ—నీవు చదివినదె మరల చదువ నక్కఱలేదు.

విక్రి—హా అపడినాను క్షమించవలెను—(చదువుచున్నాఁడు.) "అట్టి వ్యర్థడంభముగలదానిని ముఖస్తుతులతోనుకల్లగౌరవముతోను లోఁబఱుచుకొని మోసపుచ్చి యనాయాసముగా మన కార్యసాఫల్యము చేసికోవచ్చును." —ఆహా! ఏమి యీబుద్ధిహీనత!— "కాఁబట్టి యీముసలిభూతముయొక్క యనుమతితోనే శీఘ్రకాలములో నిన్నుచూచుట కొక్కయుపాయ మున్నది. ఈకామతంత్రనిర్వాహణములో మన యిద్దఱినడుమను సందేశములు గొనిపోవుటకయి యీముసలిదానినే మన మొకదూతికనుగాఁగూడ నుపయోగించుకోవచ్చును.",— ఆహా! ఏమి యీసాహసము!

సుభ—ఆకండకావరము చూచినావా? తనసామర్థ్యవిశేషము చేత నాజాగరూకత యంతయు విఫల మగునట్లు చేయునఁట! చేయనిమ్ము. ఆహాహాహా! ఈవ్రాఁతనుబట్టి చూడఁగా వాఁడు నిశ్చయముగా మనయింటికి రాకమానఁడు. మనము శ్రద్ధవహించి యెవరి యుపాయము చక్కఁగాఁ బాఱునో చూతము.

విక్రి—చూతము మనమిద్దఱమును తప్పక శ్రద్ధవహించి చూతము. ఆహాహాహా! అతని కెంతగర్వము! ఆహాహాహా! నే నొక్కమంచియాలోచన చెప్పెదను. సుభద్రమ్మా! ఈచిన్నదాని కతనిమీఁద నంత మోహ మున్నందున నీవుకొంతకాలమువారియుత్తర

ప్రత్యుత్తరములు చూచియు చూడనట్లు నటించు; ఆచిన్నదానినిష్ట మున్న యెడల నతనితో లేచిపోవుటకుఁగూడ పన్నుగడలుపన్నినిమ్ము; ఆచిన్నది పాఱిపోవుచున్నను నీ వుపేక్షించిన ట్లూరకుండు. ఎఱుఁగన ట్లుండి సూసమయమునకు నే నుట్టిపడి యతనిని తఱిమి వేసి, అప్పు డొక మాయోపాయముచేత నతనికిమాఱుగా నేనే పిల్లదాని నెత్తు కొని పాఱిపోయెదను.—ఈయుపాయము బాగున్నదా?

సుభ—దివ్యముగా నున్నది. ఇటువంటిమంచియుపాయము జన్మ మెత్తినతరువాత నే నెన్నఁడును వినలేదు.

విక్రి—ఇప్పుడాచిన్నదానిని నేనొక్కపర్యాయముముందుగా చూడవచ్చునా? ఈలోపల ముందుగా నే నా మెస్వభావము కొంచెము కనిపెట్టవలెను.

సుభ—చూడనేవచ్చును. తాళు ఆచిన్నది యిప్పుడు నిన్ను చూచుటకు సిద్ధముగా నున్నదో లేదో! ఇటువంటివిషయములలో మనము రాజకన్యలలోఁ గలమర్యాదలను కొంచెము చూడవలెను.

విక్రి—ఈమర్యాదల నాచిన్నది నావిషయములో నంత లక్ష్యము చేయదు. విజయపాలుఁడని చెప్పు—

సుభ—ఏమీ!

విక్రి—(తనలో) ఏమి యీకంఠమార్దవము!

సుభ—నీ విప్పు డన్నది విజయపాలుఁ డని కాదా?

విక్రి—అవును పరిహాసార్థముగా నీ వాచిన్నదానితో విజయపాలుఁడు వచ్చినాఁడని చెప్పుమని నీతో ననఁబోవు చున్నాను. ఆమాట చెప్పగానే యామె క్రిందికి పరుగెత్తుకొని వచ్చును. ఆహాహాహా! (అని నవ్వుచున్నాఁడు.)

సుభ—దానివిషయములో నిటువంటిమాయ చేయవలసినదే. అంతేకాక వాఁడు నా యనుమతితోనే దానిని చూచెద నని వ్రాసినాఁడు. అహాహా! చేతనయినపక్షమున, చూడమను.—ఓకళావతీ! క్రిందికి రా. (పిలుచుచు) వాడు నన్ను తమ యిద్దఱి నడుమను సందేశములు గొనిపోవుటకు దూతికనుగా నుపయోగించునఁట!—ఆహాహా కళావతీ! క్రిందికి దిగిరా. నీవు నవ్వుటకు నా కాశ్చర్యము లేదు. ఆహాహా! వాని పొగరుఁబోతుతనము నిజముగానే పరిహాసాస్పదముగా నున్నది.

విక్రి—అవును. నిశ్చయముగా పరిహాసాస్పదముగానే యున్నది: ఆహాహాహా!

సుభ—ఏమి దాని పొగరు! అకుఱ్ఱది నామాటే వినిపించుకోదు. నేనే పోయి వచ్చినది యెవరో యిప్పుడే చెప్పెదను. తన్ను చూడవచ్చినవాఁడు విక్రమసేనుఁ డనియే చెప్పి, కన్య కర్హమయిన రీతిని నడుచుకొనునట్లు చేసెదను.

విక్రి—నీమనసువచ్చినట్లు చేయవచ్చును.

సుభ—విక్రమసేనా! ఇప్పటివఱకు నేను నీకు దూతికనయినాను. ఏమి? యింకను నీవు నవ్వుట యయిపోలేదు! వాఁడు నాజాగరూకత యంతయు విఫలమగునట్లు చేయునఁట! ఆహాహాహా!

(అని వెళ్ళుచున్నది.)

విక్రి—ఆహాహాహా! ఇంతట నే నీమాఱువేషము తీసివేసి నిజవేషముతోనే ప్రియురాలిని దక్కించుకో వచ్చునని యితరు లనుకోవచ్చును. కాని కళావతియొక్క చపలచిత్తతనుబట్టి చూడఁగా నిజమయిన వేషమును బయలఁబెట్టినపక్షమున మొదలే చెడిపోవు

నేమో యని నాకు భయ మగుచున్నది. ఆమె నన్ను తెలిసికొనునో లేదో చూతము.

(ఇటునటు నడిచి గోడల పటములవంకఁ జూచుచున్నాఁడు.)

[కళావతి ప్రవేశించుచున్నది.]

కళా—నాకిప్పు డొక్క గొప్ప గొడవ సంభవించినది! ఇష్టములేని కొత్తవాఁడు వచ్చి నన్ను వరించుమని చేసెడి యసహ్యములయిన ప్రార్థనలను వినుటకంటె కష్టతరమయినపనిమఱియేదియు నుండదు. నావలెనే బాధింపఁ బడిన కన్యలు తమ్ము వరింపవచ్చిన వారితో తమహృదయము వేఱొకరిమీఁద నిలిచియుండుట తెలిపి వారిని ప్రార్థించి పంపివేయుచు వచ్చినట్లు విన్నదానను. కాఁబట్టి యిప్పుడు నేనును నదేప్రకారముగాఁ జేయవలెను. అదిగో! నా నూతనవరుఁ డెదురుగా నిలిచియున్నాఁడు. అతఁడు గొప్ప యుద్యోగస్థుఁడట! ఇతనికిని మా విజయపాలునికిని ఎంతవ్యత్యాస మున్నది! ఇతఁడు ముందుగా మాటాడకున్నాఁడు! ఇతఁడు చూడఁగా సిగ్గుల పెండ్లికొడుకులవలెఁ గనఁబడుచున్నాఁడు. ఇతఁడు నా వంకనైనను జూడక నిర్విచారముగా నిలుచున్నాఁడు. నేనే మొదట పలుకరించెదను—విక్రమసేనా!

విక్రి—ఆ! (అని యభిముఖుఁ డగుచున్నాడు.)

కళా—ఏమి యీ యాశ్చర్యము! నా విజయపాలుఁడా?

విక్రి—ప్రాణేశ్వరీ! మెల్లఁగా మెల్లఁగా వింతపడఁబోకు.

కళా—ఒక్క వింతమాత్రమే కాదు నా కపరిమితభయప్రమోదములు కూడఁ గలుగుచున్నవి. నీ విక్కడ కెట్లు రాఁ గలిగినావు? నాకద్భుతముగా నున్నది.

విక్రి—బహుభాషలతో పనిలేదు. నేను నీ మేనత్తను

మోసముచేసినాను. నాక్రొత్తప్రతిపక్షి యీసాయంకాల మిక్కడకు రాఁబోవుచున్నాఁడని విని, ఒక యుపాయముచేత నాతనిని రాకుండఁజేసి నేనే విక్రమసేనుఁడ నని యామెవద్దకు వచ్చినాను.

కళా—నీయుపాయము చక్కఁగా పాఱినది. ఆమె నిజముగా నీవే విక్రమసేనుఁడ వనుకొనుచున్నది.

విక్ర—ఆవిషయమయి యామెకు దృఢనిశ్చయముకలిగినది.

కళా—ఆహాహా! తనంత తెలివిగలవారు లేరని గర్వపడుచుండెడి యామెను నీవు మించిపోవుట తలఁచుకొని నేను నవ్వాపుకొనలేకున్నాను.

విక్ర—అమూల్య మయిన కాలమును మనమిప్పుడు వ్యర్థపుచ్చుచున్నాము. ఇటువంటి మంచిసమయము మనకు మఱియొకప్పుడు మరల దొరకదు. ఓ ప్రాణధనమా! నాపాలిటి భాగ్యదేవతవైన నిన్నీయవస్థాబాధనుండి రక్షించి యీసేవకుఁడు శీఘ్రముగా నుచితబహుమానమును పొందుటకుఁ దగిన సుముహూర్తమును వెంటనే సిద్ధాంతము చేయుము.

కళా—విజయపాలా! అట్లయినపక్షమున నీవునాయల్పధనముయొక్క పోకడ కొప్పుకొన్నావా? ఎగిరిపోవుటకు వీలులేకుండునట్లుగా నాయిచ్ఛావిహంగముయొక్క ఱెక్కలమీఁద నిప్పుడాధనమే మహాభారముగా నిలిచియున్నది.

విక్ర—ఆభారము విడిచివచ్చినీవునన్ను కృతార్థుని జేయుము. నాకు నీ సౌందర్యధనమే చాలును. నీయనురాగసంపదనుదక్క నీవు నాకు మఱేమియు నరణము తీసికొని రానక్కఱలేదు. ఓకళావతీ! ఆయనురాగధనము నీవద్ద పుష్కలముగా నున్నదికదా! నిర్ధనుఁ

డయిన నీ విజయపాలుఁడు నీ వర్ణించెడి యారాయొక్క ధనమును మాత్రమే నీకు మరలఁ దీర్పఁగలఁడు.

కళా—(తనలో) ఈతనిమాట లెంత హృదయాహ్లాదకరములుగా నున్నవి! దారిద్ర్యదేవతయీతనికంటి కెంత మనోహరముగాఁ గనఁబడుచున్నది!

విక్ర—ఓహో! మన మెటువంటిబ్రతుకు బ్రతుకఁబోవుచున్నాము! అప్పుడు కామదేవుఁ డొక్కఁడే మన కారాధ్యుఁ డయి రక్షకుఁ డగును; అప్పుడుమనము తుచ్ఛములయిన యితరప్రాపంచిక భోగముల నన్నిటిని విడనాడి మనఃకాయకర్మలచేత నాతని నొక్కనినే తదేకచింతతో నర్చించుచు సుఖింతము. కష్టమన్న గర్వపడుచు మన మప్పుడు భాగ్యదేవతయొక్క వైకల్యముచూచి సంతోషసుఖ మనుభవింతము. చుట్టును నావరించి యుండెడువిపదంధకారములో మనయనురాగదీప మన్యోన్యస్నేహరసముచేత మఱింత యసమాన కాంతితో ప్రజ్వరిల్లి వెలుంగుచుండునట్లు చేయుదము. ఈశ్వరుని తోడు! నాజీవధన మయినకళావతిని నాహృదయపీఠమునందు స్థిరముగాఁ జేర్చుకొనుభాగ్యము నాకబ్బెడుపక్షమున, ఈలోకములో భాగ్యదేవత ప్రసాదించెడు సమస్తసంపదలను దానశూరత గలయీ హస్తములతో తృణప్రాయముగా నెగఁజిమ్మివేసి హృదయేశ్వరి నా నిండుకౌఁగిట నున్నప్పుడు దక్క వేఱొకప్పుడీప్రపంచ మెప్పుడును నాకు సుఖదాయకము కాదని ఘోషింపఁగలను—(అని కౌఁగిలింపఁబోవుచు తనలో) ఈచిన్నదిప్పుడు నన్ను నిరాకరించినపక్షమున ఇఁక నా కాశ లేదు.

కళా—(తనలో) ఇప్పుడు నేనతనితో దిగంతముల వఱకైనను

పాఱిపోవలెనని బుద్ధిపుట్టుచున్నది. అయినను నన్నిప్పుడు వీరు పెట్టుచున్న బాధ యింకను నన్నంత తెంపరిని జేయలేదు.

[చెవియొగ్గి యాలకించుచు సుభద్రమ్మ ప్రవేశించుచున్నది.]

సుభ—(తనలో) ఈ మంకుకుఱ్ఱది యతనియెడల నెట్లు ప్రవర్తించుచున్నదో తెలిసికోవలెనని నా మనస్సు తహతహ పడుచున్నది.

విక్ర—కళావతీ! విచారముగా నున్నావేమి? ఇంతకుమును పున్న నీ యుద్రేక మిప్పుడు తగ్గిపోయినట్లున్నది.

సుభ—(తనలో) ఉద్రేక మిప్పుడు తగ్గిపోయినదఁట! అది యితనిమీఁద నింతవఱకును దురాగ్రహవ్యగ్రురాలయి యున్నది కాఁబోలును!

కళా—లేదు. నా దేహములో ప్రాణ మున్నంతవఱ కెప్పుడును తగ్గిపోదు.

సుభ—(తనలో) ఓసి దుస్స్వభావపుచిఱుభూతమా! ఇది యావజ్జీవమును కోపోద్రేకమును విడువనే విడువదఁట! ఏమి దీని మిడిసిపాటు!

కళా—నా వెఱ్ఱిమేనత్తయొక్క పనికిమాలిన బెదరింపులను నేను లక్ష్యముచేయుదు నని నీవు స్వప్నావస్థయందును తలఁపవలదు.

సుభ—(తనలో) పెద్దదానియందు దీని కెంతభక్తి!

కళా—ఆమె కోరి తెచ్చినవాఁడు విక్రమసేనుఁడే కానిమ్ము. నేను విజయపాలునిదక్క వేఱొక్కని వరింపను.

సుభ—(తనలో) దీని సాహసమునకు నాకద్భుత మగుచున్నది. ఇట్లితని మొగము ముందఱనే స్పష్టముగాఁ జెప్పుచున్నది!

విక్ర—(కాళ్ళమీఁదఁ వ్రాలి) నీ దాసునిప్రార్థన చెల్లింపుము.

సుభ—(తనలో) అయ్యో! పాపము! పాదముల మీఁదఁ బడి యాచిన్నవాఁడు దయచూపుమని దీనిని దీనముగా వేఁడుకొనుచున్నాఁడు. ఇఁక నేనిది చూచి సహింపలేను—(ముందుకువచ్చి) ఓసి కొంకనక్కా—మీసంభాషణ యంతయు నేను విన్నాను.

విక్రి—(తనలో) ఓసి నీ జాగరూకత కాలిపోను!

సుభ—విక్రమసేనా! ఈనిర్భాగ్యురాలు నీయెడఁ జూపిన మొఱకుఁదనమునకై నీకు నేనెట్లు క్షమార్పణము చేయవలెనో యెఱుఁగఁజాలకున్నాను.

విక్రి—(తనలో) ఇఁక భయములేదు. సర్వమును సురక్షితముగానే యున్నది—(ప్రకాశముగా) కాలమహిమచేత నాకీచిన్నది దక్కకున్న యాశ నన్ను విడువలేదు.—

సుభ—ఇటువంటి మూర్ఖురాలివిషయమయి యాసపెట్టుకొన్న ప్రయోజనము లేదు. గోదావరినదిలో నుండెడు మొసళ్ళకెంత తలబిరుసో దీనికంత తలబిరుసు.

కళా—అత్తా! నాయుం దిప్పుడు నీ వారోపింపబోయెడు దోష మేమి?

సుభ—ఓసి సిగ్గుమాలినదానా! నీ ప్రేమమఱియొకపురుషుని మీఁద నున్నదని నీ విప్పు డితని ముఖముముందు చెప్పలేదా? నీ వీతని నెప్పుడును వరింపనని యిప్పుడు చెప్పలేదా?

కళా—చెప్పలేదు. నేనట్లు చెప్పలేదు.

సుభ—ఓయి భగవంతుఁడా! ఏమి యీ సత్యసంధత! కళావతీ! అబద్ధములాడుట ముందుకు రాఁ దలఁచుకొన్న నీవంటి కన్యకకు తగదని నీ వెఱిఁగి యుండవలసినది. నీ హృదయ మాపనికిమాలిన విజయపాలుని మీఁద తగిలియున్న దని నీవింతకుముం దననే

లేదా? నేను మరల నడుగుచున్నాను. నావంకఁ జూచి నా కీయొక్క మాట కుత్తరము చెప్పు.

కళా—అన్నాను. ఒక్క విజయపాలునిమీఁద దక్క—

సుభ—చాలు! చాలు! ఇఁక నోరుమూసికో. ఏమి యీ దుండగము! ఆఁడుదాని కింత యదరిపాటు కూడను.

విక్ర—సుభద్రమ్మా! ఈచిన్నదానిని చెప్పఁదలఁచుకొన్న దంతయుఁ జెప్పనిమ్ము. ఈమె యేమి చెప్పినను నాకు సంతోషమే. ఈమాటవలన నాకెంతమాత్రమును నష్టము లేదు. నామాట నమ్ము.

సుభ—విక్రమసేనా! నీ వతికరుణాళుఁడవు; అతిశాంతుఁడవు. ఓసీ! కుఱ్ఱదానా! నీవు నావెంటరా.—విక్రమసేనా! మనము మరలఁ గలిసికొందము. మన మేర్పఱుచుకొన్నది మఱచిపోకు.

విక్ర—మఱచిపోను.

సుభ—ఓసీ! కళావతీ! ఈయనయొద్ద మర్యాదతో సెలవు పుచ్చుకొనిరా.

కళా—నాహృదయేశ్వరుఁడైనవిజయపాలునికి సమస్తశుభములును కలుగునుగాక!

సుభ—ఓసి నీనోరు పడిపోను. పాడురండా! నీచదువు చాలును. ఈపాటి నోరుమూసికొనిరా. (అని నోరునొక్కి కళావతిని బలవంతముగా నీడ్చుకొనిపోఁగా, అందఱును విభ్రమించు చున్నారు.)

౮. రంగము—దామోదరవర్మ యిల్లు.

[మంచిబట్టలు ధరించుకొని దామోదరవర్మయు. మాధవుఁడును ప్రవేశించు చున్నారు.]

దామో—మాధవా! నే నిప్పు డందముగా నున్నానా?

మాధ—మహారాజులాగు వున్నారు. ఈకొత్తబట్టలవల్ల వెనుకటిరూపమే మారిపోయి యిప్పుడు మీకు యెక్కడలేనిఅందమూ వచ్చింది. వెనుకటిరూపానికీ యిప్పటిరూపానికీ పోలికే లేదు.

దామో—ఈబట్టలవల్ల నంతమార్పు వచ్చిన దేమి?

మాధ—మార్పోగీర్పో నేనుచెప్పలేను. మీరుయీ వేషంతో అవ్వగారియింటికి వెళితే ఆవిడ మిమ్మలిని ఆనవాలే పట్టలేదు· మీ గుర్రపువాఁడు మీరు మీపేరు చెప్పినా నమ్మడు; మనదాసీదిమిమ్మలిని చూస్తే యెవరో వింతమనిషి వచ్చినాడని జడుసుకుంటుంది. వెయ్యిమాట లెందుకు? మీకుక్కకూడా మిమ్మల్నిచూస్తే మొరుగుతుంది.

దామో—మాధవా! అలంకారముతో సమాన మయినది మఱియొకటిలేదు. లోపలిరూప మెట్లున్నను పయిమెఱుఁగు ముఖ్యముగా నుండవలెను.

మాధ—అందుచేతనే నాయిత్తడిగిన్నెను మెరుగుపెట్టు మని రోజూకంచరివాడితో చెపుతాను. వాడు నామాట వినడు.

దామో—టపాలో నాకుత్తరము లేమైనవచ్చిన వేమో చూచిరా.

మాధ—చూచివస్తాను. మీముఖం చూస్తే నాకు ముచ్చటవుతూవున్నది. (అని పోవుచున్నాఁడు)

దామో—(ఇటునటు మందగమనముతో నడుగులుపెట్టుచు) ఇది హంసయానములాగున నున్నది. ఈపాదవిన్యాసము నేనునాట్యాచార్యునియొద్ద నేర్చుకొన్నాను. నాట్యాచార్యుఁడు తిన్నఁగా గ్రహింపలేక నాయడుగులు వేయుట నృత్యశాస్త్రానుగుణముగా లేదని తప్పుపట్టినాఁడు. నాకు నడకలు దిద్దుటకు వాని కేమి తెలియును? నా ముద్దునడక యభినయశాస్త్రమును మించి యున్నది. నానడక దివ్యముగా నున్నది. మొన్న గ్రామదేవత జాతరలో అమ్మవారుపూనిన శివశక్తి సరిగా నావలెనే నృత్యము చేసినది.

[మాధవుఁడు మరల ప్రవేశించు చున్నాఁడు.]

మాధ—పురుషోత్తమదేవుడుగారు మీదర్శనంకోసం వచ్చినానని చెప్పుమన్నారు.

దామో—ఆయనతో రావచ్చు నని చెప్పి నీవు పో.

మాధ—మంచిది. (అని మరలఁ బోవుచున్నాఁడు.)

[పురుషోత్తమదేవుఁడుగారు ప్రవేశించు చున్నారు.]

పురు—దామోదరవర్మా! నిన్నిక్కడఁ జూడఁగలుగుటచేత నాకు పరమసంతోషముగా నున్నది.

దామో—నాకంతకంటె సంతోషముగా నున్నది.

పురు—నీవింత యాకస్మికముగా పీఠికాపురమున కేమిపని మీఁద వచ్చినావు?

దామో—కామదేవునిపనిమీఁద వచ్చినాను. కామదేవుఁడు నన్నిక్కడ కాశపెట్టి తీసికొనివచ్చి తుదకు చిక్కులలో పడవేసినాఁడు. నాకిక్కడ గొప్పయవమానము తటస్థించినది. నన్నవమానపఱిచినవారి పేరులుమాత్ర మిప్పుడు చెప్పను. నాకెంత యవమానము సంభవించిన దనుకొన్నావు?

పురు—నీవు నాకు పేర్లు చెప్పనక్కఱ లేదు. నీకు తటస్థించిన యవమాన మేమో చెప్పు.

దామో—ఒకచిన్నదానిమీఁద నామనస్సుదృఢముగా తగిలి నది. ఆచిన్నదానికి కావలసినవారు నాప్రార్థన కామోదించి యీ గ్రామమునకు రమ్మన్నారు. ఎంతో ప్రయాసపడి వచ్చినతరువాత వా రిప్పు డాచిన్నదానిని మఱియొకరి కియ్య నిశ్చయించుకొన్నామని వర్తమానము పంపినారు. నేను దీని నవమానముగా తలఁచు చున్నాను.

పురు—ఇది తప్పక యవమానమే. లోకములో నింతకన్న మానవంతున కెక్కువ యవమాన మేముండును? దీనికి కారణము నీ వేమని యూహించెదవు?

దామో—ఊహ యెందుకు? అది ప్రత్యక్షమే. దీనికంతకును కారణము విజయపాలుఁ డనువాఁడు. ఆచిన్నది వానిని మోహించిన దఁట! వాఁ డిప్పు డీయూరనే యున్నాఁడఁట! ఈ యవమానమున కంతకును వాఁడేమూలమయియుండవలెను. అందుకుసందేహము లేదు.

పురు—నీకు ప్రతిపక్షుఁ డొకఁడు బైలుదేఱినాఁడా! ఏమి? చెప్పవు! అతఁ డక్రమమయినమార్గముచేత నిన్నుతొలఁగఁద్రోసినాఁ డేమో చెప్పఁగలవా?

దామో—ఆవిషయమయి యింతయాలోచన యెందుకు? అక్రమముగానే వాఁడు నన్ను నిరాకరించునట్లు చేసినాఁడు. క్రమ మయిన మార్గముచేత నయిన పక్షమున వాఁడు నన్ను కదలింపఁ గలిగియుండునా?

పురు—నీ విఁకను చేయవలసిన దేమో నీకు తెలియునా?

దామో—నాకు తెలియదు.

పురు—మనవద్ద నిప్పుడు కత్తులు లేవు. నామాటలు నీ కర్థమయినవా?

దామో—ఏమీ! నేను వానితో యుద్ధము చేయవలెనా?

పురు—అవును. చేయవలసినపని యదొక్కటే. అంతకంటె మఱేమియు లేదు.

దామో—వాఁడు నాకు కోపకారణ మేదియుఁ గలుగఁ జేయలేదే!

పురు—అతఁడు కలుగజేసినంత కోపకారణము మఱియెవ్వరును నీ కెప్పుడును గలుగఁజేసి యుండరు. లోకములో నింతకంటె నధికకోపకారణము మఱి యేదుండును? ఒకఁడు కామించిన చిన్నదాని కడ్డమువచ్చి తాను గామింపఁబూనుటకంటె మనుష్యుఁ డాతని విషయములో నెక్కువ యపరాధము చేయుట సాధ్యమగునా? అటువంటివాఁడు క్షమింపఁదగని గర్భశత్రువు. ఇది స్నేహధర్మమునకు మహావిరోధము.

దామో—స్నేహధర్మమునకు విరోధమా! స్నేహధర్మముండుటకు మొదట వానితో నాకు పరిచయమయినను లేదే! నే నీవఱకెన్నఁడును వానిని చూడనైనను చూడలేదు.

పురు—నీవాతని మొగ మెఱుఁగకపోవుట యుద్ధము చేయరాదనుటకు హేతువు కాదు. తాను క్రొత్తవాఁ డయినప్పుడు నీకతఁడు బొత్తిగానే ద్రోహము తలఁపఁ గూడదు.

దామో—అదినిజమే. అందుచేతనే నాకు వానిమీఁద మహాకోపము. తుపాకి కాల్చవలెనేమి? కత్తులుకూడ దూయవలెను కాఁబోలును! ఇట్లు పోరాడుటకు మహాధైర్యము కావలెను కాఁబోలును! అవునా? పెద్దమనుష్యునితో కయ్యము పెట్టుకొను—

టకు ముందుగా నాపక్షమున న్యాయ మున్నదేమో చూడనక్కఱ లేదా?

పురు—అవమానము సంభవించినప్పుడు న్యాయ మెవరికి కావలెను? పూర్వము హిరణ్యకశిపుఁడును రావణాసురుఁడును విజయ యాత్రబైలు దేఱినప్పుడు న్యాయ మాలోచించియే బైలుదేఱిరా రనుకొన్నావా? లేదు లేదు. వారు మహాశూరు లయి యెదిరించిన వారి తలలెల్లకొబ్బరిపుచ్చెలలాగునఖడ్గములతో నఱకవేసిన్యాయము నిమిత్తమయి మనసువచ్చినచోట మొట్టపెట్టు కొండని పిటికిపంద లను వదలి వేసినారు.

దామో—నీ శూరవాక్యములు ప్రకాపోద్దీపకములుగా నున్నవి. నీ వీరాలాపముల వలన నామనస్సునకుఁగూడ నొకవిధ మయిన ధైర్యమువచ్చి ప్రవేశించుచున్నట్టున్నది! ఇదే వీరావేశము కాఁబోలును! తుపాకులతోను బాకులతోను తక్షణము కదలి వాని నిప్పుడే నాతో ద్వంద్వయుద్ధమునకుఁ బిలిచెదను.

పురు—ఓ దామోదరా! నావద్ద నిప్పుడు మా వంశవృక్ష మున్నపక్షమున మా పూర్వులనందఱిని నీకొక్కక్కరినే వరుసగా పేరిపేరివరుసను జూపియుందును. శూరాగ్రేసరు లయిన మా పెద్ద లలో నొక్క శత్రువునైనను తన ఖడ్గధారతో తల నఱకని వీరుఁ డొక్కఁడును లేఁడుసుమా! వంశక్రమాగత మయిన క్షాత్రమును మాత్రము మన మెన్నఁడును విడువరాదు.

దామో—ఓ పురుషోత్తమదేవా! మీ పూర్వులవలెనే మా పూర్వులును మహాపౌరుష శాలులే. మూలపురుషుఁడు మొదలుకొని నావఱకును మా పెద్దలందఱును యోధానుయోధులే. వారిలో నొకఁడు సేనాధిపత్యము చేసెనఁట! ఆవార్త యటుండనిమ్ము.

ఇప్పటి నీప్రతాపాగ్నివలన నామనస్సులో శత్రువుమీఁదఁ గల దయారసమంతయు నింకిపోయినది. నేను నిజముగా రణశూరుఁడ నయినాను. నా శరీరము పరవశ మగుచున్నది!

పురు—కోపము తెచ్చుకొని వేగిరపడకు. ఇటువంటి కార్యములలో తొందరపా టెంతమాత్రమును గూడదు. ఇట్టి ఘనకార్యములను సదా శాంతతతో చేయవలెను.

దామో—నేను కోపము తెచ్చుకో వలెను. నేను వీరావేశము పొందవలెను. నామానము నిలుపఁదలఁచుకొన్న పక్షమున, నీవు నాకోపముమాత్ర మిప్పుడు చల్లాఱునట్లు చేయకు. ఇదిగో కాగితమును కలమును. (అని వ్రాయుటకుఁ గూరుచుండి) ఇది యెఱ్ఱసిరానైన బాగుండును! అప్పుడు నా కంటికి నాపోటువలన నెత్తురు వఱదలు కట్టుచున్నట్లు కానఁబడును. నా యక్షరములు చూచి పగవాఁడు భయపడునట్లుగా నుత్తరము వ్రాయవలెను. పెద్ద యక్షరములతో వ్రాయుదునా ఎట్లారఁభించవలెనో చెప్పు. ప్రతి పదములోను వీరరస మొలుకుచుండవలెను.

పురు—నీయుత్తరము నీవే యాలోచించుకొని యారంభించు.

దామో—వానిప్రాణము గొనుటకయి శపథములతో నారంభింతునా? 'ఓనిర్భాగ్యుఁడా!' అని మొదలుపెట్టుదునా?

పురు—అట్లు చేయఁగూడదు. మన మెదుటివానికి గౌరవమును జూపుచు మనము పెద్దమనుష్యులమని తోఁచునట్లుగా వ్రాయవలెను. "అయ్యా!"—అని మొదలుపెట్టు.

దామో—నన్నవమానపఱిచినవాని కంతగౌరవముచేయనా? మంచిది! అలాగుననే వ్రాసెదను. వానినే చెడ్డవానిని గానిమ్ము.

పురు—"మన మిద్దఱమును నేకసుందరినిమిత్తమే—"